RNI. No: TELTEL/2023/88215


# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 94 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం సెప్టెంబర్, 28, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 94 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday, September, 28, 2025 | PAGES : 8 RS : 4 /-



## దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ

# 4జీ నెట్‌వర్క్

**ప్రారంభించిన ప్రధాని మోదీ**

**- ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ**

ఢిల్లీ,: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగినఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికిఅంకితం చేశారు. ఈచారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది.




- ఐక్యరాజ్యసమితిలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని
- షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భారత్
- పాకిస్థాన్‌ది ఉగ్రవాదాన్ని కీర్తించే విధానమంటూ ఫైర్
- ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయమిచ్చిన విషయం గుర్తుచేసిన దౌత్యవేత్త
- సింధు జలాల ఒప్పందం ఉల్లంఘన యుద్ధ చర్యేనన్న పాక్
- ఉగ్రవాదం ఆపితేనే ఒప్పందం పునరుద్ధరణ అని భారత్ స్పష్టీకరణ

## ఉగ్రవాదాన్ని కీర్తించడమే..

# మీ పని

**ఐరాసలో పాక్‌ను ఏకిపారేసిన భారత్**

ఐక్యరాజ్యసమితి : ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రస్థాయిలో మండిపడింది. పాక్ ప్రధాని ప్రసంగం ఓ 'అసంబద్ధమైన నాటకం' అని, ఉగ్రవాదాన్ని కీర్తించడం వారి విదేశాంగ విధానంలో భాగమని భారత్ ఘాటుగా బదులిచ్చింది. శనివారం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తావించారు. కశ్మీర్ ప్రజల స్వీయ నిర్ణయాధికారానికి తమ మద్దతు ఉంటుందని, ఐరాస ఆధ్వర్యంలో నిష్పాక్షిక ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.



## మైక్రోసాఫ్ట్‌కు..

# ట్రంప్ అల్టిమేటం

**ఆమెను వెంటనే తీసేయండి!**

- మైక్రోసాఫ్ట్ అధికారిణి లీసా మొనాకోను తొలగించాలన్న ట్రంప్
- ఆమె అవినీతిపరురాలు, జాతీయ భద్రతకు ముప్పు అంటూ తీవ్ర ఆరోపణలు
- బైడెన్ హయాంలో పనిచేయడమే ఆమెపై ఆగ్రహానికి కారణం
- తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ పెట్టిన అమెరికా అధ్యక్షుడు
- ప్రభుత్వ కాంట్రాక్టులున్న కంపెనీలో ఆమె ఉండటంపై అభ్యంతరం

వాషింగట్టన్: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఆ సంస్థలో గ్లోబల్ అఫైర్స్ హెడ్‌గా పనిచేస్తున్న లీసా మొనాకోను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లీసా మొనాకో ఒక "అవినీతిపరురాలు" అని, ఆమె "అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పు" అని ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



## మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లిన రాహుల్ గాంధీ

ఢిల్లీ,:కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లారు. రాహుల్ దక్షిణ అమెరికా పర్యటనకు బయల్దేరినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్, కొలంబియా తో పాటు మరో రెండు దేశాల్లో కాంగ్రెస్ అగ్రనేత పర్యటించనున్నారు. అక్కడరాజకీయ నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు, వ్యాపారవేత్తలతో సంభాషించనున్నారు. కాగా, గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటించిన సమయంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే.




## సాంకేతిక నైపుణ్యంతోనే

# ఉద్యోగావకాశాలు

**- ఇంగ్లీష్ ఒక్కటే ఉంటే ఉద్యోగం రాదు**

- యువతలో స్కిల్స్ కోసమే టాటా కన్సల్టెన్సీతో చర్చలు
- వారి సహకారంతోనే ఎటిసి సెంటర్లు ఏర్పాటు
- స్కిల్ ఉంటే జపాన్, జర్మనీల్లో ఉద్యోగావకాశాలు
- మల్లేపల్లి ఎటిసి సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** కేవలం సాఫ్ట్‌వేర్ కోర్సులతోనే విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయని అనుకోవద్దని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏటీసీలో శిక్షణ పొంది జర్మనీలో నెలకు రూ.3.50 లక్షలు జీతం వచ్చే ఉద్యోగాలు పొందినవారు ఉన్నారు. చదువు, సాంకేతిక నైపుణ్యం మాత్రమే మన తలరాతను మారుస్తాయి. సాంకేతిక నైపుణ్యం లేకపోతే ఈరోజుల్లో దేనికి కొరగాని పరిస్థితి. గంజాయి కేసుల్లో అధికంగా ఇంజినీరింగ్ విద్యార్థులే దొరకడం దురదృష్టకరం. గంజాయికి బానిసలై తల్లిదండ్రులకు క్షోభ కలిగించవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలోని మల్లెపల్లి ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 65 ఏటీసీలను వర్చువల్ గా ప్రారంభింప చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలను ఏటీసీలుగా ప్రభుత్వం మార్చింది.. చదువుతో పాటు–విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించాలి అన్నారు.



## ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** భారీ వర్షాల కారణంగా హైదరాబాద్‌లో మూసీనది ఉధృతంగా ప్రవహిస్తున్నది. హిమాయత్‌సాగర్ గేట్లు– ఎత్తడంతో మూసీకి వరద పోటెత్తింది. దీంతో బాపూఘాట్ నుంచి దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తింది. పురానాపూల్ వద్ద 13 అడుగుల మేర ప్రమాదకరంగా మూసీ ప్రవహిస్తున్నది. ఎంజీబీఎస్‌ను వరద చుట్టుముట్టింది. బస్టాండ్ లోపలికి వెళ్లే రెండు బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహించింది. బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌లు వరద నీటితో మునిగిపోయాయి. చాదర్‌ఘాట్ లోయర్ బ్రిడ్జి పైనుంచి మూసీ వరద ప్రవహిస్తున్నది. మూసారంబాగ్ బ్రిడ్జి పైనుంచి 10 అడుగుల ఎత్తులో వరద పారుతున్నది. మూసీ చుట్టుపక్కల కాలనీలు, బస్తీల్లోకి వరద ముంచెత్తింది. భారీ వర్షాలతో హైదరాబాద్ నగరాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పురానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ ఏకంగా 13 ఫీట్ల ఎత్తుతో పొంగిపొర్లుతోంది. గడిచిన 30 ఏళ్లలో మూసీకి ఈ స్థాయిలో వరద రావడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. మూసీ వరద తాకిడికి పలు ప్రాంతాల్లో గుడులు కూడా మునిగిపోయాయి.



## విమర్శలతో పాపాలను

# కడక్కోలేరు

**ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** బిఆర్ఎస్ విమర్శలు కోటలు దాటుతున్నాయి. ఓ వైపు హరీష్ రావు, మరోవైపు కెటిఆర్ చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయి. బంగారు తెలంగాణ జరిగివుంటే ఇన్ని సమస్యలు మళ్లీ ఎందుకు వచ్చాయన్నది ఆలోచించాలి. ఇకపోతే కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా తన వైఖరిని ధృడపర్చుకున్నారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా,నేతలతో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువ కాలం మనలేరని కూడా రుజువు చేసుకున్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేక పోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ బిఆర్ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్ల పాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బిఆర్ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు. తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామని డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది.



## సుప్రీంకోర్టు మెట్లెక్కిన

# 11 ఏళ్ల బాలుడు

- ఢిల్లీ ప్రభుత్వ స్కూల్లలో ప్రవేశ పరీక్షలపై వివాదం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన 11 ఏళ్ల విద్యార్థి
- పరీక్షలు విద్యాహక్కు చట్టానికి విరుద్ధమని పిటిషన్‌లో వాదన
- జులై 23 సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్
- ప్రవేశ పరీక్షలకు బదులు లాటరీ పద్ధతి అమలు చేయాలని వినతి
- సీఎం శ్రీ పాఠశాలల్లో ప్రవేశాలపై న్యాయపోరాటం

ఢిల్లీ,: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షల విధానాన్ని సవాలు చేస్తూ, ఓ 11 ఏళ్ల బాలుడు ఏకంగా సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఎం శ్రీ పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ జన్మేశ్ సాగర్ అనే విద్యార్థి సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. వివరాల్లోకి వెళితే, ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం శ్రీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పరీక్షలు ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009 స్ఫూర్తికి విరుద్ధమని జన్మేశ్ తన పిటిషన్‌లో స్పష్టం చేశాడు. తాను 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నానని, జులై 23న ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు సెప్టెంబర్ 13న పరీక్ష కూడా రాశానని తెలిపాడు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఏటీసీ సెంటర్లు

## - జిల్లా కలెక్టర్ మను చౌదరి







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :** అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) సెంటర్ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న ఏటీసీ సెంటర్ల ను ఐటిఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శనివారం శామీర్ పేట్ మండలంలో ఐటిఐ కాలేజీలో ఏటీసీ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసేందుకు ఐటిఐలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మారుతున్న టెక్నాలజీ కనుగుణంగా మీరు ఆలోచించి ఆవిష్కరణలను రూపొందించాలని అన్నారు. మీరు నేర్చుకునే అంశం గురించి తప్పకుండా మీ తోటి వారితో చర్చించాలని తద్వారా అంశంపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. మీలోని భయాన్ని విడిచి నలుగురిలో మాట్లాడేలా మిమ్మల్ని మీరు తీర్చి దిద్దుకోవాలన్నారు. అందువల్ల భవిష్యత్తులో ధైర్యంగా ఇంటర్వ్యూలలో సమాధానం ఇవ్వగలుగుతారని విద్యార్థులకు హిత బోధ చేసారు. చాలా వరకు విద్యార్థులకు ఇంటర్వ్యూలలో థియరీ నాలెడ్జ్ ఉంటుందని, ప్రాక్టికల్ నాలెడ్జ్ లేక పోవడం ద్వారా ఉద్యోగాలు రావడం లేదని అన్నారు.

ఈ సమస్య ను ఆధిగమించేందుకే ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి నుండి మీరు థియరీ తోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. ఎన్ని విషయాలు తెలిసి ఉన్నప్పటికి వాటి గురించి బయటకి చెప్ప గలిగినప్పుడే గుర్తింపు వస్తుందని అన్నారు. మీలోని సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోని ఏదో ఉద్యోగం కోసం కాకుండా పదిమందికి ఉపాధికల్పించే విధంగా ఆలోచించాలని విద్యార్థులకు సూచించారు. మీరు చదివే అంశాల గురించి ఎక్కువగా విశ్లేషణ చేస్తుంటే మీకు కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయని, వాటిలో ముఖ్యమైన అంశాల గురించి చర్చించాలని సూచించారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి కలెక్టర్ ఎటిసి సెంటర్లోని మిషనరీలకు పూజ చేసారు. అనంతరం కలెక్టర్ ఎటిసి సెంటర్లోని గదులను కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ ఆలయంలో వారాహి పాశుపత హోమం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, నిజాంపేట గ్రామంలోని కనకదుర్గ ఆలయంలో శనివారం వారాహి పాశుపత హోమం నిర్వహించారు. శనివారం కనకదుర్గమ్మ వారాహి అమ్మవారు రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ఆలయ ధర్మకర్తగా వ్యవహరిస్తున్నాడు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు అన్ని కార్యాలలో విజయం సిద్ధించాలని, నవగ్రహ దోషాలు తొలగిపోవాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రతి ఏటా విజయదశమి పండుగ సమయంలో కనకదుర్గమ్మ ఆలయంలో ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయుడు కొలను తరుణ్ రెడ్డి, కొలనుభద్రారెడ్డి, కడియాల ఇందిర, శ్రీశైలం యాదవ్, గిరీష్ కుమార్, నిజాంపేట గ్రామస్తులు, స్థానిక ప్రజలు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చర్లపల్లిలో ప్రభుత్వ భూములు, నాలా కబ్జాలపై మంత్రికి ఫిర్యాదు

**చర్లపల్లి, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :**చర్లపల్లిలో ప్రభుత్వ భూములు, నాలా కబ్జాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర యంగ్ లీడర్స్ ఉపాధ్యక్షులు బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్, యువజన నాయకులు కడియాల నందకిషోర్ ఫిర్యాదు చేసారు. ఖద్దర్ చొక్కలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చర్లపల్లి లో ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని పలుమార్లు ఫిర్యాదులు చేసిన అధికార యంత్రంగం పట్టించుకోవడం లేదన్నారు. చర్యలు తీసుకోకపోవడం వెనక రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కోట్ల రూపాయలు ఖరీదు చేసే ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను, అక్రమ కట్టడాల వెనుక రాజకీయ నాయకుల పాత్ర ఉందన్నారు. కాప్రా తహసిల్దార్ కు ఎన్ని ఫిర్యాదు చేసిన కబ్జాలపై ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల కబ్జా, నాలలపై ఇరిగేషన్ శాఖ ఇన్ స్పెక్షన్ రిపోర్ట్ లో కబ్జాలకు గురైందని ఇచ్చినప్పటికి తహసిల్దార్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక రాజకీయ అండదండలు ఉన్నాయని అనుమానాలు కలుగుతున్నయన్నారు. ప్రభుత్వ కబ్జాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. కోట్ల



రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో అధికారులు, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం రాకుండా చూడాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నాలల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోమని ఆదేశాలు ఉన్నప్పటికీ ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి, కబ్జాలు చేసిన వారువరైనా కఠిన చర్యలు తెసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# తెలంగాణే శ్వాసగా బతికిన కొండా లక్ష్మణ్ బాపూజీ

## - రాష్ట్ర సాధనకు బాటలు వేసిన బాపూజీ
## - కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులు అర్పించిన స్పోర్ట్స్ అథారిటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ)** :ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాధన ఉద్యమ యోధుడు, దివంగత నేత ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలు స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం ఎల్బీ స్టేడియంలో చైర్మన్ శివసేన రెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే తెలంగాణ ఉద్యమకారులకు నిజమైన గుర్తింపు లభిస్తోందని అన్నారు. తెలంగాణ కోసం కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి ప్రతి ఒక్క త్యాగధనులను భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ (1915%-%2012) తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ పోరాటంలో కీలక నాయకులలో ఒకరని, ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో 27 సెప్టెంబర్ 1915న



జన్మించిన స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడని చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కోసం మొదటి నుంచే నిరంతరంగా శ్రమించారని అన్నారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసి ఆ తర్వాత పది ఏ పదవి చేపట్టని త్యాగధనుడని అన్నారు. 2001లో తెలంగాణా రాష్ట్రం సాధ్యం కావడానికి ముందు ఆయనే ఒక లక్ష్యంగా మారి, చివరి వరకు తెలంగాణా రాష్ట్ర సాధనే శ్వాసగా బ్రతికారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు కోచులు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

## - మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి లో చేపడుతున్న ఫ్లైఓవర్ పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాన్ని పూర్తి చేయాలని బాచుపల్లి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి డిమాండ్ చేశారు. అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు నత్తనడకను తలపిస్తుందని ఆరోపించారు. శనివారం ఆమె స్థానికులతో కలిసి ఫ్లై ఓవర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్ చేపట్టిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం కొరకు స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఫ్లై ఓవర్ పూర్తి చేయడానికి ప్రభుత్వం డెడ్లైన్ విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఫ్లై ఓవర్ ఉపరితలంపై నిర్మాణాలను పూర్తి చేయడానికి ముందే ఫ్లైఓవర్ కి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డును తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తద్వారా వాహన




రాకపోకలకు అణువుగా ఉంటుందని ఆమె సూచించారు. ఫ్లైఓవర్ కి ఇరువైపులా యూటర్న్ రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ప్రస్తుత వర్షాకాలంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా బాచుపల్లి ప్రధాన రహదారులు ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా నెలకు ఉన్నాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్బారావు, దాసి నాగరాజు, రచ్చ చక్రధర్, కొండమ నాయుడు, సమీప కాలనీల అసోసియేషన్ నేతలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగారంలో కన్నుల పండుగ బతుకమ్మ వేడుకలు





**నాగారం, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :**నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్ రోడ్ నెం. 5 లో శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు ఆడి పాడారు. ఈ వేడుకల్లో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి. శ్రావణ్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్, ఎ. బాబు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజలలో ఐక్యతను, సంతోషాన్ని పెంపొందిస్తాయని కమిషనర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీ వాసులు, ముఖ్యంగా మహిళలు, ఈ సంబరాలను విజయవంతం చేయడంలో చురుకుగా పాల్గొనడాన్ని ఆయన అభినందించారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

## - దమ్మాయిగూడ మున్సిపల్ ప్రాంగణంలో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు





**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ)** :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని దమ్మాయిగూడ మున్సిపల్ ఎన్. వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూతెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉందన్నారు. తొమ్మిది రోజుల పాటు రంగు రంగుల పూలతో, ఆటా పాటలతో అంగరంగ వైభవంగా బతుకమ్మ పండుగను నిర్వహిస్తారని అన్నారు. ప్రకృతికి, స్త్రీతత్వానికి ప్రతీకైనా ఈ పండుగలో భాగంగా గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపుకు బతుకమ్మ ప్రతీక అని అన్నారు. బతుకమ్మ పండుగలో వివిధ రకాల పూలను తంగేడు, గునుగు, చామంతి, బంతి పువ్వులను పేర్చి బతుకమ్మను తయారు చేస్తారని, తొమ్మిది రోజులపాటు ప్రతి రోజు గౌరమ్మకు ప్రత్యేక నైవేధ్యాలు సమర్పిస్తారని అన్నారు. బతుకమ్మ మహిళల ఐక్యతకు, ఆనందానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మహిళా సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ప్రయాణికుల కోసం లక్కీడ్రా

**కుషాయిగూడ, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ)** :దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల కోసం లక్కీ డ్రా పథకాన్ని నిర్వహిస్తోందని కుషాయిగూడ డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 6వ తేదీ వరకు ఆర్టీసీ సెమి డీలక్స్, డీలక్స్ సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు వారి టికెట్ వెనకాల పేరు ఫోన్ నెంబర్, చిరునామా రాసి ఆయా బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సుల్లో వేయాలన్నారు. అక్టోబర్ 8న సాయంత్రం నాలుగు గంటలకు ప్రతి ప్రాంతీయ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో లక్కీ డ్రా ఉంటుందని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ. 25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు, తృతీయ బహుమతి గా రూ. 10 వేలు లక్కీ డ్రాలో గెలుపొందిన




వారికి అందిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌలభ్యం కోసం ఈసీఐఎల్ బస్ స్టేషన్ లో లక్కీ డ్రా బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. కావున ప్రయాణికులు అందరూ సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :**మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, డిఎం అండ్ హెచ్ ఓ ఉమాగౌరీ, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత, సాంస్కృతిక కళాకారులు, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంపాదకీయం

### భారత్ ను టార్గెట్ చేసి బాగుపడిన చరిత్రా..

అతిగా ఆశపడే ఆడది.. అతిగా ఆవేశపడే మగాడు సుఖపడినట్లు చరిత్రలోనే లేదు.. ఇది ఓ సినిమా డైలాగ్. అయితే ఈ డైలాగ్ ఇప్పుడు భారత్‌తో కయ్యానికి కాలుదువ్విన దేశాలకు వర్తిస్తుంది. భారత్‌ను దెబ్బతీయాలని, డ్యామేజ్ చేయాలని చూసిన ఏదేశమూ బాగుపడలేదు. భారత్‌ను విమర్శించిన దేశాలు ఒక్కొక్కటిగా రాజకీయ, ఆర్థిక సంక్షోభాల్లో కూరుకుపోతున్నాయనే చర్చ ఇటీవల ఊపందుకుంది. మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, మయన్మార్, కెనడా, నేపాల్ వంటి దేశాలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నాయి. ట్రంప్ వ్యవహారశైలి కారణంగా అమెరికా కూడా భారత్‌తో ఘర్షణ పడుతోందని, రాబోయే రోజుల్లో అది సంక్షోభంలోకి జారుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణాసియా దేశాలైన మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్, మయన్మార్‌లు ఇటీవలి కాలంలో రాజకీయ, ఆర్థిక అస్థిరతలతో సతమతమవుతున్నాయి. ఈ దేశాలు భారత్‌తో సంబంధాలలో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి, కొన్ని సందర్భాల్లో భారత్‌పై విమర్శలు గుప్పించాయి. ఈ సంక్షోభాల వెనుక ఆయా దేశాల అంతర్గత రాజకీయాలు, ఆర్థిక సమస్యలు, విదేశీ శక్తుల ప్రభావం కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2023లో అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు 'ఇండియా ఔట్' నినాదంతో ఎన్నికల్లో గెలిచారు. భారత సైనిక ఉనికిని తొలగించాలని డిమాండ్ చేసిన ఆయన, చైనాతో సంబంధాలను బలోపేతం చేశారు. అయితే, 2024లో ఆర్థిక సంక్షోభం, పర్యాటక రంగంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలో ఒడిదొడుకులు మాల్దీవులను కుదిపాయి. దీంతో ముయిజ్జు భారత్‌తో సంబంధాలను మెరుగుపరచడానికి ప్రయత్నించారు, కానీ దేశంలో రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం, విద్యార్థుల నిరసనలు బంగ్లాదేశ్‌ను రాజకీయ అనిశ్చితిలోకి నెట్టాయి. హసీనా భారత్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండగా, ఆమె పతనం తర్వాత బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ), ఇతర ఇస్లామిస్ట్ సమూహాలు చైనా, పాకిస్తాన్‌లతో సంబంధాలను బలపరిచే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ మార్పు భారత్‌కు భద్రతా సవాళ్లను, మైనారిటీ హిందువులపై దాడుల ఆందోళనను తెచ్చిపెట్టింది. 2022లో ఆర్థిక సంక్షోభం శ్రీలంకను అతలాకుతలం చేసింది. గోటబాయ రాజపక్సే ప్రభుత్వం పతనం, అనుర కుమార దిస్సానాయకే నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. శ్రీలంక చైనాకు రుణబాధ్యతలు ఎక్కువగా ఉండగా, భారత్ 4 బిలియన్ డాలర్ల సహాయంతో ఆదుకుంది. దిస్సానాయకే భారత్‌తో సహకారాన్ని కొనసాగిస్తూ, చైనాతో సమతుల్యతను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. దీర్ఘకాలంగా భారత్‌తో శత్రుత్వం కలిగిన పాకిస్తాన్ ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో సతమతమవుతోంది. 2022లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం పతనం, ఆర్థిక అస్థిరత, ఉగ్రవాద బెడద పాకిస్తాన్‌ను బలహీనపరిచాయి. భారత్‌పై విమర్శలు, కాశ్మీర్ విషయంలో ఘర్షణాత్మక వైఖరి కొనసాగుతున్నప్పటికీ, షాంఘై సహకార సంస్థ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాల్గొనడం, కర్తార్‌పూర్ కారిడార్ ఒప్పందం పునరుద్ధరణ వంటివి సంబంధాలలో కొంత మెరుగుదలకు సూచనలు. 2021లో సైనిక తిరుగుబాటు తర్వాత మయన్మార్ అంతర్యుద్ధంలో చిక్కుకుంది. దేశంలో 14% భూభాగం మాత్రమే జుంటా నియంత్రణలో ఉంది. ఈ అస్థిరత భారత్ ఈశాన్య సరిహద్దులలో ఉగ్రవాదం, మాదక ద్రవ్యాల రవాణా సమస్యలను తెచ్చిపెట్టింది. భారత్ మయన్మార్‌లోని తిరుగుబాటు గ్రూపులతో సంప్రదింపులు జరుపుతూ, దౌత్యపరమైన సమతుల్యతను కాపాడుతోంది. 2025లో సోషల్ మీడియా నిషేధం నేపథ్యంలో జెన్%-%జెడ్ నిరసనలు నేపాల్‌లో ప్రధాని కేపీ. శర్మ ఓలి రాజీనామాకు దారితీశాయి. ఓలి చైనాతో సంబంధాలను బలోపేతం చేస్తూ, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ఒప్పందాలపై సంతకం చేశారు, ఇది భారత్‌తో సంబంధాలలో ఒత్తిడిని తెచ్చింది. భారత్ ఈ పరిణామాలను దౌత్యపరంగా ఎదుర్కొంటూ, నేపాల్‌తో ఆర్థిక, సాంస్కృతిక సహకారాన్ని కొనసాగిస్తోంది. అమెరికా, భారత్‌తో సంబంధాలలో ఇటీవల కొన్ని ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ పాకిస్తాన్‌లోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడి చేయడం అమెరికా రహస్య సైనిక కార్యకలాపాలను బహిర్గతం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. దీని ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25% అదనపు సుంకాలను విధించారని, ఆర్థిక ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని చర్చ జరుగుతోంది. అయితే, అమెరికా రాబోయే రోజుల్లో సంక్షోభంలోకి జారుకుంటుందనే వాదనకు స్పష్టమైన ఆధారాలు లేవు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, భారత్‌తో వాణిజ్య ఉద్రిక్తతలు, దక్షిణాసియాలో చైనా ప్రభావం పెరుగుదల వంటి అంశాలు దాని విదేశాంగ విధానంపై ఒత్తిడిని తెచ్చే అవకాశం ఉంది. భారత్ తన పొరుగు దేశాలతో 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానాన్ని కొనసాగిస్తోంది. బంగ్లాదేశ్‌కు 8 బిలియన్ డాలర్లు, శ్రీలంకకు 4 బిలియన్ డాలర్ల సహాయం, నేపాల్, మాల్దీవులతో ఆర్థిక, సాంస్కృతిక సహకారం ద్వారా భారత్ తన ప్రభావాన్ని కాపాడుకుంటోంది. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా ఈ దేశాల్లో పెట్టుబడులను పెంచుతుండగా, భారత్ బిమ్‌స్టెక్, బీబీఐఎన్ వంటి సబ్%-%రీజినల్ సహకార వేదికల ద్వారా చైనా ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది. అమెరికాతో సంబంధాలను దృష్టిలో ఉంచుకుని, భారత్ క్వాడ్ (అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) వంటి భాగస్వామ్యాల ద్వారా దక్షిణాసియాలో స్థిరత్వాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తోంది.

## అలుగు పారుతున్న నాటికన్ చెరువుకు గంగపూజ, హారతి





కీసర, సెప్టెంబర్ 27, (తెలంగాణ దిశ) :కీసర మండలం చీర్యాలలోని శ్రీశ్రీశ్రీ చీర్యాలలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న నాటికన్ చెరువు నిండి అలుగు పారడంతో ఆలయ ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి శనివారం గంగపూజ నిర్వహించారు. పసుపు, కుంకుమ చల్లికి గంగాతల్లికి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



**స్వాతంత్ర సమర యోధుడు, తెలంగాణ ఉద్యమకర్త కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి వేడుకలను దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. వెంకటే రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ వెంకటేశం, సానిటరీ ఇన్ స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – (నాగారం, తెలంగాణ దిశ)**

## ప్రమాదంలో సముద్ర జీవజాతులు..







పర్యావరణాన్ని అశ్రద్ధ చేస్తే ఎంతటి విపరీతాలు వస్తాయో అనడానికి మన కళ్ల ముందు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. మానవాళి మనుగడకే కాదు, భూచరాలు, ఉభయచరాలు, జలచరాలపై కూడా ఈ ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందనేది ఎప్పటికప్పుడు నిరూపితమౌతూనే ఉంటుంది. తాజాగా మన రాష్ట్ర తీరప్రాంతాల్లో 'ద సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సిఎంఎఫ్ఆర్ఐ) నిర్వహించిన సర్వే మరోసారి ఆ విషయాన్ని రుజువుచేసినట్లు ప్రముఖ వార్తాసంస్థ 'ద హిందూ'లో ప్రచురితమైంది. ఈ సర్వే ప్రకారం ఆంధ్రా తీరంలో వెయ్యికి పైగా(1,275) సముద్ర జంతు, వృక్ష జాతులను గుర్తించారు. అయితే వీటిలో అనేక జాతులు తీవ్ర ముప్పులో ఉన్నాయని సర్వే స్పష్టం చేసింది. భావనపాడు(శ్రీకాకుళం), భీమునిపట్నం(విశాఖ), అంతర్వేదిపాలెం (డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ) ప్రాంతాలను సిఎంఎఫ్ఆర్ఐ పరిశీలన కోసం తీసుకుంది. ఆ ప్రదేశాల్లో అందుబాటులో ఉన్న సముద్ర/జీవ వనరులు ఎంత విలువకి చెందుతాయో అంచనా వేసే లక్ష్యంతో పనిచేస్తోంది. అయితే భావనపాడు, అంతర్వేదిపాలెంలో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. సముద్ర జీవవైవిధ్యంపై రెండేళ్ల కాల పరిమితితో ఏపి స్టేట్ బయోడైవర్సిటీ బోర్డ్(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి)(ఎపిఎస్‌బిబి) నిధులతో ఈ పరిశోధనా ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ సిఎంఎఫ్ఆర్ఐ, 2024 జనవరి 24 నుండి 2025 జనవరి 23 మధ్య కాలంలో తీరప్రాంతంలో 1275 రకాల సముద్రవృక్షాలు, జంతు జాతులను గుర్తించింది. ఆ జాతుల్లో 14 వర్గీకరణ సమూహాలకు చెందిన 456 వంశాలు ఉన్నాయి. సుమారు 290 కుటుంబాలు 98 వర్గాలకు చెందినవిగా గుర్తించారు. అధ్యయనం ఇంకా పూర్తికానందున ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సిఎంఎఫ్ఆర్ఐ నివేదిక ప్రకారం అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం(ఐయుసిఎన్) వర్గీకరణలో 74 జాతులు అత్యంత సంక్షోభంలో ఉన్నాయి. అంటే అవి మనుగడ సాగించే వీలుకాని ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించారు. అలాగే 2022 భారత వన్యప్రాణి సంరక్షణ చట్టంలోని షెడ్యూల్-1 కింద, వాటిల్లో 46 జాతులను అంతరించిపోతున్న వన్యవృక్షాలు, వన్య ప్రాణుల అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందం(సిఐటిఇఎస్)లో నమోదుచేశారు. ఇంకా నాలుగు వర్గీకరణ గుంపుల నుండి 35 జాతులు రక్షించబడినట్లు తెలిపారు. ఎపిఎస్‌బిబి చైర్మన్ ఎన్.విజయ్ కుమార్ ఈ ప్రాజెక్టు గురించి ఇలా వివరించారు. 'సముద్ర జీవ వైవిధ్యంపై ప్రభావం చూపుతున్న మానవులు చేస్తున్న కీలక పనులను గుర్తించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ అధ్యయనంలో వేటకి సంబంధం లేని ఎన్నో జీవజాతులు మత్స్యకారుల వలలో చిక్కుకుంటున్నాయని తేలింది. దీంతో కొన్ని అరుదైన సముద్ర జీవజాతులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇంకా ప్లాస్టిక్ కాలుష్యం, గోస్ట్ గియర్ చిక్కుకోవడం, అక్రమ గవ్వల వ్యాపారం వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

ఈ సర్వే ప్రకారం, సిఎంఎఫ్ఆర్ఐ ఆంధ్రా తీరం వెంబడి తీర, సముద్ర జీవవైవిధ్యంపై బయో ఇన్వెంటరీ(జీవ వనరుల జాబితా) తయారీతో పాటు డాక్యుమెంటేషన్‌ని సిద్ధం చేసింది. దీనివల్ల పర్యావరణ వ్యవస్థలని సముచితంగా ఎలా ఉపయోగించుకోవాలో అనేదానిపై స్పష్టత వస్తుంది. అలాగే విలువైన జీవ వనరుల స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది' అని విజయ్ కుమార్ చెప్పారు.

మన రాష్ట్రానికి సుమారు 1,053 కిలోమీటర్ల తీర రేఖ ఉంది. ఈ ప్రాంతం ఖండాంతర షెల్ఫ్(సముద్ర గర్భంలో ఉన్న ఒక అంచు. ఇది నిస్సారమైన నీటితో కప్పబడి ఉంటుంది. తీరం నుండి లోతైన సముద్రం వైపు వాలుగా ఉంటుంది. ఇది తీరప్రాంతం నుండి ఖండపు అంచు వరకు విస్తరించి, వివిధ రకాల సముద్ర జీవరాశులకు, సహజ వనరులకు ఆవాసంగా ఉంటుంది) గుండా విస్తరించి, గొప్ప పర్యావరణ కీలకమైన సముద్ర జీవఆవాసాలతో నిండిపోయింది. దాదాపు 33 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో బురదనేలలు, నదీముఖ ద్వారాలు, క్రీక్‌లు, ఇసుక బీచ్‌లు, మడ అడవులు,చిత్తడి నేలలు, సముద్ర గడ్డి పడకలు, రాతి బీచ్‌లు ఉన్నాయి. ఈ ప్రదేశాలు అపారమైన సముద్ర వృక్షాలు, జంతువుల ఆవాసాలకుకేంద్రంగా ఉన్నాయి. సిఎంఎఫ్ఆర్ఐ పరిశోధన ప్రకారం, జాతుల వైవిధ్యంలో అత్యధికంగా 54 శాతం ఫిన్‌ఫిష్‌లు ఉన్నట్లు గుర్తించారు. వాటి తరువాత స్థానంలో 24 శాతం మొలస్కులు ఉన్నాయి. తీరప్రాంతంలో గుర్తించిన నాలుగురకాల సముద్ర తాబేళ్లు ఆలివ్ రిడ్లీ, గ్రీన్స్, హాక్స్‌బిల్, లెదర్‌బ్యాక్‌లో ఒక జాతి అత్యంత సంక్షోభంలో ఉందని సర్వే స్పష్టం చేసింది. సముద్ర క్షీరదాలు: తిమింగలాలు, డాల్ఫిన్లు, ఫిన్‌లెస్ పోర్పోయిస్‌లు సహా మొత్తం 16 జాతుల సముద్ర క్షీరదాలను డాక్యుమెంటేషన్‌లో చేర్చారు. వీటిలో దంతాల తిమింగలాలు, డాల్ఫిన్లు మొత్తంగా 10 జాతులు అత్యధిక వైవిధ్యాన్ని చూపించాయి. అలాగే 16 నిజమైన మడ అడవుల జాతులను నమోదుచేశారు. ఇంకా ఈ అధ్యయనంలో 23 జెల్లీ ఫిష్ జాతులను గుర్తించారు. వీటిలో భారత్, పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణమండల తేమతో కూడిన జలాల్లో కనిపించే రోఫిలేమీ నోమాడికా అనే రకం మొదటిసారి భారత్ జలాల్లో గుర్తించారు.

## ఆ గ్రహంపై జీవం ఉండే ఛాన్స్ : జేమ్స్‌వెబ్ టెలిస్కోప్



సైటెక్ (టెక్నాలజీ) : ఈ విశ్వంలో భూమి కాకుండా మరెక్కడైనా జీవం ఉందా? అని శాస్త్రవేత్తలు సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. పలు గ్రహాలతో పాటు సుదూర ప్రాంతాల్లో ఉన్న నక్షత మండలాలను సైతం పరిశీలిస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు జీవం ఆనవాళ్లు మాత్రం దొరకలేదు. అయితే విశ్వాన్ని అధ్యయనం చేస్తున్న జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ కీలక సమాచారం ఇచ్చింది. సూర్యుడికి 124 లైట్ ఇయర్స్ దూరంలో కే 2 %-18ఎ అనే గ్రహంలో శాస్త్రవేత్తలు ఈ టెలిస్కోప్ సాయంతో వాతావరణాన్ని పరిశీలించారు. అక్కడ జీవం ఉండే సంకేతాలు కనిపించినట్లు వెల్లడించారు.

బలమైన సంకేతం: భూమికి సుదూర ప్రాంతంలో విశ్వాన్ని అధ్యయనం చేస్తున్న జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ కీలక సమాచారం ఇచ్చింది. సూర్యుడికి 124 లైట్ ఇయర్స్ దూరంలో కే2-18 అనే గ్రహంలో శాస్త్రవేత్తలు ఈ టెలిస్కోప్ సాయంతో వాతావరణాన్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే ఊహించని ఫలితాలు వచ్చాయి. ఈ గ్రహంలో డైమెథైల్ సల్ఫైడ్ , డైసల్ఫైడ్ రసాయనాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ కెమికల్స్ ప్రస్తుతం భూమిపై ఉన్న జీవుల వల్లే ఉత్పత్తి అవుతున్నాయి. మరీ ముఖ్యంగా అల్గే వంటి సూక్ష్మజీవుల వల్ల ఉత్పత్తి అవుతాయి. అయితే ఈ గ్యాస్‌లు ఆ గ్రహంపై జీవం ఉందనేది చెప్పడానికి ఆధారం కాకపోయినా.. దీన్ని ఓ బలమైన సంకేతంగా పరిగణించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆ గ్రహంపై నీరు కూడా ఉండే అవకాశం : ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్‌దీనిపై కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్ స్పందిస్తూ %ొ%. ఆ గ్రహంపై జీవం ఉందన్న భావనకు ఇది బలమైన సంకేతమని అన్నారు. అంతేకాదు ఆ గ్రహంపై ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌లు భూమి కంటే వేల రేట్లలో కేంద్రీకలతమై ఉన్నాయని తెలిపారు.

## ప్రపంచాన్ని చుట్టిరానున్నమొదటి మహిళా సెయిలింగ్ బృందం!



ముంబయి : భారత సాయుధదళాలకు చెందిన మహిళా సెయిలింగ్ బృందం మొదటిసారిగా ప్రపంచాన్ని చుట్టి రానుంది. సాయుధ దళాలకు చెందిన ఆర్మీ, నేవీ మరియు వైమానిక దళానికి చెందిన 10మంది మహిళా బృందం తొలిసారిగా భారత సైన్యం సెయిలింగ్ వెసెల్ (ఐఎఎస్‌వి) త్రివేణిలో 21,600 నాటికల్ మైల్స్ చుట్టివచ్చేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్11న ప్రారంభంకానున్న ఈ మిషన్ ఎనిమిది నుండి తొమ్మిది నెలల పాటు కొనసాగనుంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనా మరియు దక్షిణాఫ్రికా నాలుగు విదేశీ ఓడరేవులను సందర్శించి 2026 మేలో తిరిగి ముంబయి చేరుకోనుంది. తాము ఐఎఎస్‌విలో ప్రపంచాన్ని చుట్టిరానున్న మొదటి మహిళా బృందం కానున్నామని స్క్వాడ్రన్ లీడర్ శ్రద్ధా రాజు పేర్కొన్నారు. భారత త్రివిధ దళాల శక్తిని ప్రదర్శించనున్నామని అన్నారు.

యుద్ధ విమానం సుఖోయ్ -30 సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న శ్రద్ధా రాజుకు 11 సంవత్సరాల అనుభవం ఉంది. భారత సాయుధ దళాలు సంయుక్తంగా మొదటిసారిగా ప్రపంచాన్ని చుట్టివచ్చే నావిగేషన్ మిషన్‌కు నాయకత్వం వహిస్తున్నందున యూనిఫాంలో నారీశక్తికి ఇది ఒక ప్రకాశవంతమైన ఉదాహరణగా నిలవనుందని అన్నారు.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

### తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్, తెలంగాణ దిశ:** నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చనిసూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: 91 9949351270. పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.

## ఓదెల దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**పెద్దపల్లి, తెలంగాణ దిశ :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం లోని శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి దేవాలయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఎమ్మెల్యే చింతకుంట విజరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ అభివృద్ధి కోసం తీసుకునే చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్ తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. అంతకుముందు ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యే, కలెక్టర్ లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి ఎమ్మెల్యే, కలెక్టర్ లకు అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ నెలరోజుల్లోగా ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయం పరిసరాలలో 500 మీటర్ల లోపు భూములలో నిర్మాణాలు గానీ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు గాని చేయరాదన్నారు. ఆలయ భవిష్యత్తు అవసరాల కోసం అందరు సహకరించాలని కోరారు. జిల్లాలోని ఈ అతిపెద్ద ఆలయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే డబుల్ రోడ్డు నిర్మిస్తున్నామని, ఆలయ ప్రిన్సెస్ లో రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ డివైడర్ లను నిర్మిస్తామన్నారు. ఓదెల ఆలయానికి సంబంధించి అన్ని రకాల టికెట్లను ఇక ఆన్లైన్లో విక్రయించాలని నిర్ణయించి నట్టు చెప్పారు.

# తిరుపతి నుంచి షిర్డీకి మరిన్ని సర్వీసులు!



**తిరుపతి, తెలంగాణ దిశ :** తిరుపతి మీదుగా షిర్డీ వెళ్లాలనుకునే ప్రయాణికులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఎప్పటి నుంచో భక్తుల నుంచి ఉన్న అభ్యర్థనకు గ్రీన్ సిగ్నల్ పడింది. రోజూ తిరుపతి షిర్డీ మధ్య ట్రైన్ నడపాలనే రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు కేంద్ర రైల్వే శాఖ ఓకే చెప్పంది. దీంతో త్వరలోనే ఈ ఈ రెండు స్టేషన్‌ల మధ్య ప్రతి రోజూ ట్రైన్ నడవబోతోంది. తిరుపతి షిర్డీ మధ్య ప్రస్తుతం 07637/07638 నెంబర్ ఉన్న ట్రైన్ నడుస్తోంది. ఇది కేవలం ఆదివారం మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీన్ని ప్రతి రోజూ నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ ట్రైన్ ప్రతి రోజూ భక్తులకు అందుబాటులో ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఈ ట్రైన్ అన్ని రోజుల పాటు నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. చంద్రబాబు లేఖపై స్పందించిన రైల్వే శాఖ తిరుపతి షిర్డీ మధ్య ప్రతిరోజూ ట్రైన్ నడిపేందుకు అంగీకరిస్తూ ప్రతి లేఖ రాసింది. తిరుపతి నుంచి షిర్డీ మధ్య సుమారు 1074 కిలోమీటర్ల రైల్వే దూరం ఉంటుంది. అయితే వివిధ ప్రాంతాలను కలుపుతూ నడుస్తున్న రైళ్లు దాదాపు 1369 నుంచి 1439 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ రెండు ప్రధాన పుణ్యక్షేత్రాల మధ్య మూడు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి వారానికి ఒకటి లేదా రెండు రోజులు నడుస్తాయి. వాటిలో ప్రధానమైంది 1. స్పెషల్ ఫేర్ సమ్మర్ స్పెషల్ (07637) ఇది తిరుపతి లో ప్రారంభమై సాయినగర్ షిర్డీ వరకు నడుస్తుంది. ఇందులో ప్రయాణ సమయం సుమారు 29 గంటల 15 నిమిషాలు. ఇప్పుడు కేవలం ఆదివారం మాత్రమే అందుబాటులో ఉంది. ఇది త్వరలోనే అన్ని రోజుల్లో అందుబాటులోకి రానుంది. తిరుపతి లో ఉదయం 05:30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10:45 గంటలకు షిర్డీ చేరుకుంటుంది. ఈ ట్రైన్‌లో స్లీపర్ క్లాస్‌లో ప్రయాణం చేయాలంటే సుమారు ?780, 3 కోచ్ కోసం ?2000, 2 కోచ్ కోసం ?3000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ట్రైన్ మొత్తం 31 స్టాప్‌లలో ఆగుతుంది. రేణిగుంట, కడప, గుంతకల్, సికింద్రాబాద్, నిజామాబాద్, ఔరంగాబాద్ మొదలైనవి స్టేషన్లు ఉన్నాయి. 17417 నెంబర్ గల వీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఇది తిరుపతి– షిర్డీ మధ్య కేవలం మంగళవారం మాత్రమే అందుబాటులో ఉంటుంది. తిరుపతిలో ఉదయం 8:15 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10:45 గంటలకు షిర్డీకి చేరుకుంటుంది. ఈ ట్రైన్ కూడా రేణిగుంట, కడప, గుంతకల్, సికింద్రాబాద్, ఔరంగాబాద్, మన్మాడ్ మొదలైనవి 32 స్టేషన్‌లలో ఆగుతుంది. 16733నెంబర్‌తో ఉన్న %=వీవీ రాఖనాూ% ఎక్స్‌ప్రెస్ కూడా అందుబాటులో ఉంది. ఇది రామేశ్వరం నుంచి ఓఖా వరకు నడుస్తుంది, కానీ తిరుపతి నుంచి నాగర్‌సోల్ వరకు సేవలనుఅందిస్తుంది. ఇది షిర్డీకి సమీపంలో ఉంది. ఈ ట్రైన శనివారం మాత్రమే నడుస్తోంది. తిరుపతిలో మధ్యాహ్నం 12:00 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11:38 గంటలకు నాగర్‌సోల్ చేరుకుంటుంది. నాగర్‌సోల్ నుంచి షిర్డీకి 40 కిలోమీటర్ల దూరాన్ని బస్సు లేదా టాక్సీ ద్వారా సులభంగా చేరుకోవచ్చు

# ఇండియా, అమెరికా చర్చలకు వేళాయెరా..




న్యూఢిల్లీ, ,: డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల బాదుడుతో భారత్, అమెరికాల మధ్య జరగాల్సిన ఆరో దశ వాణిజ్య చర్చలు అర్ధాంతరంగా వాయిదా పడ్డాయి. అయితే, ఈ చర్చలు త్వరలో న్యూఢిల్లీలో ప్రారంభం కానున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ చర్చలు, ఒప్పందం ఖరారు దిశగా సాగుతాయని పేర్కొన్నాయి వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో భారత్ తన వైఖరికి కట్టుబడి ఉండాలని భావిస్తోంది, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవల ప్రధాని స్పష్టం చేశారు..సుంకాల మేఘాలు కమ్ముకున్న వేళ... భారత్, అమెరికాల మధ్య ఆరో దశ వాణిజ్య చర్చలు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఒప్పందం ఖరారు కానుందని విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వాస్తవానికి ఆగస్టు చివరి వారంలోనే ఈ చర్చలు జరగాల్సి ఉండగా.. భారత్‌పై ట్రంప్ 50 శాతం అదనపు సుంకాలు విధించడంతో వాయిదా పడ్డాయి. ఈ చర్చలు న్యూఢిల్లీలోనే జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం భారత్‌తో వాణిజ్య చర్చలు పున:ప్రారంభమవుతాయని ట్రూత్ సోషల్‌లో హింట్ ఇచ్చారు. వాణిజ్య అడ్డంకులను అధిగమించడానికి ఇరు దేశాలూ చర్చలు కొనసాగిస్తున్నాయని ఆయన తెలిపారు."రాబోయే వారాల్లో నా ఆప్త మిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడటానికి నేను ఎదురు చూస్తున్నాను. మన రెండు గొప్ప దేశాలకు విజయవంతమైన ముగింపుకు రావడంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు " అని ట్రంప్ పోస్ట్ పెట్టారు. వైట్‌హౌస్ వద్ద ట్రంప్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా మైత్రిని చాలా ప్రత్యేకమైన సంబంధంగా పేర్కొంటూ.. మోదీ, తాను స్నేహితులుగా ఉంటామని నొక్కి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కాసేపటికే ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పై విధంగా స్పదించారు. 'బాధపడాల్సిన పని లేదు. మనకు సందర్భానుసారంగా క్షణాలు మాత్రమే ఉంటాయి' అని అన్నారు.ట్రంప్ పోస్ట్‌పై కూడా ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్ సానుకూల ఆలోచనలను తాను అభినందిస్తున్నానని, పరస్పరం స్పందిస్తున్నానని మోదీ అన్నారు. ధరలకు ప్రాధాన్యత ఇచ్చే వ్యవసాయం, డెయిరీ మార్కెట్లలోకి అమెరికా ప్రవేశాన్ని భారత్ నిరాకరించడంపై దీర్ఘకాలిక ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయినప్పటికీ ట్రంప్ పదే పదే డిమాండ్ చేస్తున్నది ఏమిటంటే అక్టోబర్ గడువు నాటికి ఒక ఒప్పందం లేదా కనీసం ముందస్తు ఫ్రేమ్‌వర్క్ ఇరుపక్షాలు ఆశిస్తున్నాయని వర్గాలు తెలిపాయి.అయితే, భారత్ వ్యవసాయం, పాడి పరిశ్రమపై తన వైఖరికి కట్టుబడి ఉండాలని కోరుకుంటుంది. చౌకైన అమెరికన్ వస్తువులు ఈ మార్కెట్లను నీరుగార్చడానికి, కోట్లాది మంది రైతులు, పశు పెంపకందారులు, మత్స్యకారులు, మహిళల జీవనోపాధిని దెబ్బతీస్తాయని భారత్ భావిస్తోంది. దీంతో పాటు మొక్కజొన్న, సోయాబీన్, యాపిల్, బాదం, ఇథనాల్ వంటి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలనే ప్రతిపాదనలను కూడా భారతదేశం తోసిపుచ్చింది. దీనిని అనుమతించడం వల్ల భారత రైతులపై ప్రభావం పడుతుందని కేంద్రం వాదిస్తోంది. ఢిల్లీలోని ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'రైతులు, మత్స్యకారులు, పశువుల పెంపకం దారులకు సంబంధించిన ఏదైనా హానికరమైన విధానానికి వ్యతిరేకంగా మోదీ గోడలా నిలబడుతున్నారు... భారత్ ఈ విషయంలో ఎప్పటికీ రాజీపడబోదని' మోదీ ఖరాఖండీగా చెప్పారు.

# మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా నల్లగొండ : ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నీలగిరి, తెలంగాణ దిశ:** మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతో పాటు, గంజాయి నిర్మూలనపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లో 18 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.52 లక్షల విలువైన 207.056 కేజీల గంజాయి, 118 గంజాయి చెట్లు, 173 మత్తు టాబ్లెట్స్ ను నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. జిల్లా పరిధిలో గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పట్ల కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నా, వినియోగిస్తున్నా టోల్ ఫ్రీ నంబర్ 8712670266 కి సమాచారం తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా పంపిణీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**మహబూబాబాద్, తెలంగాణ దిశ :** గూడూరు మండలంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న యూరియా పంపిణీని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ లోని యూరియా నిల్వలను వ్యవసాయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. క్యూ లైన్ లో ఉన్న రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి రైతులకు కలగవద్దని అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేయాలని పద్ధతి ప్రకారం యూరియా పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తెలియజేయాలని అన్నారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగభావాని, వ్యవసాయ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు ఉన్నారు.

# చేనేత అవార్డు గ్రహీతలకు సన్మానం..



**సంస్థాన్ నారాయణపురం, తెలంగాణ దిశ :** ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో కొండూరి చంద్రయ్య అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కే క్రమంలో మోకు జారడంతో మధ్యలో వచ్చి ఆగిపోయాడు. దీంతో చుట్టుపక్కలనే ఉన్న మరో ముగ్గురు గీత కార్మికులు చంద్రయ్యను చెట్టు పైకి ఎక్కి రక్షించారు. నీతో విషయం తెలుసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆ ముగ్గురు వ్యక్తులను సన్మానించారు. అనంతరం పుట్టపాక గ్రామంలో చేనేత రంగంలో జాతీయ అవార్డులతో పాటు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు అందుకున్న కార్మికులకు సన్మానం చేశారు. అదేవిధంగా పుట్టపాక లోని చేనేత క్లస్టర్‌కు ప్రహరీ గోడ నిర్మాణంకు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. తోటి కార్మికున్ని కాపాడడంలో ముగ్గురు వ్యక్తులు చేసిన ధైర్య సాహసాలను ఆయన కొనియాడారు. ఆపద సమయంలో ఓ వ్యక్తిని రక్షించడానికి అందరూ ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా చేనేత రంగంలో జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటి పుట్టపాకకు దేశంలోనే గొప్ప పేరు సాధించిన వారిని అభినందించారు. యువ చేనేత రంగంలో పుట్టపాక కు చెందిన పవన్‌కు అవార్డు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. యువత సరికొత్త ఆలోచనలతో వృత్తి నైపుణ్యానికి పదును పెడితే గొప్ప ఆవిష్కరణలను సాధించవచ్చు అనడానికి పవన్ నిదర్శనం అన్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎక్సైజ్ సీఐ బాలాజీ నాయక్, ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, ఆర్ ఐ జుబేరుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు సత్యం తదితరులు ఉన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్లో సెలెక్ట్ అయిన జిల్లా ఉద్యోగులు

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** ప్రతి సంవత్సరం జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే క్రీడా పోటీలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగు లు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సిహెచ్ రఘు తెలిపారు. ఖో ఖో క్రీడా లోసి హెచ్ ఆనంద్, ఫిజికల్ డైరెక్టర్ టేకుమాట్ల, కబడ్డీ క్రీడకు గాన సిహెచ్ సరస్వతి ఫిజికల్ డైరెక్టర్ జెడ్ పి హెచ్ ఎస్ తాడిచర్ల, వాలీబాల్ క్రీడకు గాని కే జ్యోతి ఫిజికల్ డైరెక్టర్, జెడ్ పి హెచ్ ఎస్, మహా ముత్తారం, కేమమత ఫిజికల్ డైరెక్టర్, జెడ్ పి హెచ్ ఎస్, పెద్దాపూర్, పాపికొండలు జి విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్, జి పూర్ణిమ ,ఫిజికల్ డైరెక్టర్, జడ్.పి.హెచ్.ఎస్, మహాదేవపూర్ గర్ల్స్, కే మమత ఫిజికల్ డైరెక్టర్ జెడ్ పి హెచ్ ఎస్ పెద్దాపూర్, అథ్లెటిక్స్ క్రీడకి గాను సిహెచ్ సరస్వతి ఫిజికల్ డైరెక్టర్, హెచ్ రమేష్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజామ్ నగర్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, చెస్ క్రీడకి గాను బీ.కొమలత, ఎస్ జి టి, ఎం పి పి ఎస్ కేశవాపూర్, స్పందన ,ఎస్ జి టి, ఎంపీపీ ఎస్ ఎల్కేశ్వరం. జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన ఉద్యోగులకు క్రీడా శాఖ తరుపున అభినందనలు, జాతీయ స్థాయి లో జిల్లా కి క్రీడా లలో మంచి పేరు తేవాలి జిల్లా యువజన, క్రీడల అధికారి రఘు అకాంక్షించారు.

# 250 రూపాయిలతో వైజాగ్ టూర్



**విశాఖపట్టణ, తెలంగాణ దిశ :** విశాఖను సందర్శించాలనుకు నేవారికి అదిరిపోయే వార్త. వైజాగ్‌లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు ఇటీవల రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులలో పెద్దలు రూ.250, పిల్లలు రూ.100 చెల్లిస్తే 24 గంటలు చెల్లేలా టికెట్ ఇస్తారు. దీని సాయంతో నగరంలోని పర్యాటక ప్రాంతాలను అద్దాల బస్సులో చూస్తూ చుట్టేసే వీలుంది.సాగర తీరం విశాఖపట్నం సందర్శనకు నిత్యం ఎంతోమంది పర్యాటకులు తరలి వస్తుంటారు. చారిత్రక ప్రదేశాల నుంచి ప్రకృతి సౌందర్యాల వరకూ విశాఖ కేరాఫ్ అడ్రస్. సింహాచలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు కూడా ఉండటంతో.. భక్తులు కూడా విశాఖకు క్యూ కడుతుంటారు. ఇక సమీపంలోనే అరకు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు విచ్చేస్తుంటారు. వర్షాకాలంలో అరకు లోయ కొత్త అందాలు సంతరించుకుంటూ ఉంటుంది. దీంతో పర్యాటకుల తాకిడి మరింత అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విశాఖ వచ్చే సందర్శకులకు ప్రత్యేక థ్రిల్ పంచేందుకు, అలాగే విశాఖలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే విశాఖలో తాజాగా డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం.సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశాఖలో పర్యాటక శాఖ రెండు డబుల్ డెక్కర్ బస్సులను పర్యాటకులు, స్థానికుల కోసం అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు నడుపుతున్నారు. అద్దాల బస్సులో కూర్చుని సాగర తీరం అందాలను వీక్షించేలా ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేశారు. మొత్తం 16 కిలోమీటర్ల మేరకు ఈ బస్సులు నడుస్తున్నాయి. ఈ డబుల్ డెక్కర్ బస్సులలో పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. అయితే ఇందులో ప్రత్యేకమైన సౌకర్యం ఏమిటంటే.. ఎక్కడైనా దిగి, ఎక్కడైనా ఎక్కొచ్చు. అలాగే 24 గంటల పాటు ఈ టికెట్ చెల్లుతుంది. టికెట్ కౌంటర్లను కూడా రెండుచోట్ల ఏర్పాటు చేశారు. రుషికొండ బీచ్‌తో పాటుగా, ఆర్కే బీచ్ వద్ద టికెట్ కౌంటర్లు అందుబాటులోకి తెచ్చారు.మరోవైపు ప్రతి గంటకూ ఓ బస్సు ఉండేలా ఈ డబుల్ డెక్కర్ బస్సులను నడుపుతున్నారు. ఆర్కే బీచ్ వద్ద మొదలుపెడితే.. టీయూ142, సబ్‌మెరైన్ మీదుగా సీ హారియర్ అండ్ హెలికాప్టర్ మ్యూజియం, వైజాగ్ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్కుతో పాటుగా, కైలాసగిరి రోప్‌వే, తెన్నేటి పార్కు, వైజాగ్ జూ పార్కు, ఇస్కాన్ టెంపుల్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, రుషికొండ బీచ్ జంక్షన్, తొట్లకొండ వరకు ఈ డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 వరకూ ఈ డబుల్ డెక్కర్ బస్సులు నడుస్తాయిమరోవైపు ముందుగా చెప్పుకున్న విధంగా ఈ డబుల్ డెక్కర్ బస్సుల నుంచి ఏ స్టాప్ వద్ద అయినా దిగొచ్చు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన తర్వాత వెనకాలే వచ్చే మరో బస్సులో ఎక్కేందుకు వీలుంది. ఈ సమాచారాన్ని పర్యాటకులకు గైడ్‌లు అందిస్తారు. ఉదాహరణకు మీరు కైలాసగిరి రోప్ వే చూద్దామని అక్కడ దిగిపోయారనుకోండి. కైలాసగిరి రోప్‌వే చూసిన తర్వాత.. ఆ వెనకాలే వచ్చే డబుల్ డెక్కర్ బస్సు ఎక్కే అవకాశం ఉంది. గైడ్‌లకు ఫోన్ చేస్తే ఆ బస్సు ఏ సమయానికి అక్కడకు చేరుకుంటుందనే వివరాలు తెలియజేస్తారు. ఆ రకంగా మీ ట్రిప్ ప్లాన్ చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

### ఆరోగ్యం తిరిగి పొందడానికి ఇచ్చిన సాయం జీవితాంతం గుర్తుండిపోతుంది

### క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్

**కమాన్ పూర్, తెలంగాణ దిశ :** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో బేగంపేట గ్రామానికి చెందిన ఉదరి కొమురయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో అతని కాలు తీసివేయడం జరిగింది.తన పరిస్థితిని ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ మొల్మురి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా వెంటనే క్లబ్ సభ్యులతో చర్చించి పున్నం మధుకర్ రెడ్డి,గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి యాదవ్, దొంతుల సురేష్, టీవీ సురేష్ బాబు, అడ్డూరి శేషి కుమార్, ముస్త్యాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ,దొడ్ల శ్రీనివాస్, అబ్బు కేశవ రెడ్డి, ఎల్లంకి రామరావు, కాటం సత్యం, గడ్డం శ్రావణ్ కుమార్, మురహరి రావు సహకారంతో 10,000 ఆర్థిక సహాయం మరియు గుండ శ్రీనివాస్,కుమార్ ల సహకారంతో 25కిలోల బియ్యం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ సమాజంలో ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయడామే లయన్స్ క్లబ్ ధ్యేయంగా పనిచేస్తుంది. పరిస్థితి వివరించిన వెంటనే స్పందించిన దాతలకు లైన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం మాజీ జడ్పీటీసీ క్లబ్ డైరెక్టర్ క్లబ్ డైరెక్టర్లు గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మేము చేసిన ఈ చిన్న సహాయం కొమురయ్య ఆరోగ్య పునరుద్ధరణకు దోహదపడాలని, ఇంకా ఎవరైనా దాతలు ఉంటే సంప్రదించాలని కోరుతూ భవిష్యత్తులో కూడా సభ్యుల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని కొనసాగిస్తాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# అన్నదాతలు నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

-నానో యూరియాతో బహు ప్రయోజనాలు

-యూరియా వద్దు నానో యూరియా ముద్దు

-మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా



**మంథని, తెలంగాణ దిశ :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా పేర్కొన్నారు. ఏటా ఎరువుల వినియోగంతో అనర్ధాలు పెరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రానికి నానో యూరియాని వినియోగించాలని సూచించారు. ఒక బస్తా గుళికల యూరియాతో సమానంగా అర లీటరు నానో యూరియా పనిచేస్తుందమన్నారు. అర లీటర్ మన జిల్లా కలెక్టర్ శ్రద్ధతో 150 రూపాయలకు మాత్రమే తెప్పించడం జరుగుతుందన్నారు.

కాబట్టి నానో యూరియాతో బహు ప్రయోజనాలు నానో యూరియా ని అన్ని పంటలకి ఉపయోగించవచ్చని దీనివల్ల అన్నదాతలకి రవాణా నిల్వ ఖర్చులు తగ్గుతాయన్నారు. పొలాల్లో బస్తా గుళికల యూరియా వేస్తే అందులో 30 శాతాన్ని పంట గ్రహిస్తుంది నానో యూరియా ని ఇతర పురుగుమందులతో కలిపి కూడా పిచికారీ చేసుకోవచ్చు ఇది ఆకులపై పిచికారి చేయడం వల్ల యూరియా పోషకము 80 శాతం మొక్క గ్రహిస్తుందని దీంతో దిగుబడులు ఎక్కువగా వస్తాయని పేర్కొన్నారు.

దీనివల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గి వాయు నీటి నేల కాలుష్యం తగ్గుతుందన్నారు.యూరియా వద్దు నానో యూరియా ముద్దు అని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని నేల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏడిఏ అంజని మిశ్రా తెలిపారు.

# ఆందోళనకరం



రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జరుగుతున్న బలవన్మరణాల్లో ఐదుశాతం ఆంధ్రప్రదేశ్ నుండే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2014లో 6,101గా ఉన్న ఆత్మహత్యల సంఖ్య 2022 నాటికి 8,908కి పెరిగింది. 2014లో ప్రతి లక్షమంది జనాభాకు 12 ఆత్మహత్య రేటుగా ఉంటే 2022 లో అది 16.8కి పెరిగింది. విజయవాడలో ఒకే ఏడాదిలో 65 శాతం ఆత్యహత్యల పెరుగుదల నమోదు కాగా, విశాఖపట్నంలో 22 శాతం పెరుగుదల కనిపించింది.

మరొక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది రోడ్ ప్రమాదాలతో సమానంగా ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. సమైక్యరాష్ట్ర విభజన ముందునాటితో పోలిస్తే ఆ తరువాతే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1996-2013మధ్య రోజుకి 20 మంది ఆత్మహత్యలు చేసుకోగా, విభజన తరువాత 2014-2021 మధ్య రోజుకి 41 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. పాలకులు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం ఏ దిశలో సాగుతుందో చెప్పడానికి ఈ గణాంకాలు ఒక నిదర్శనం. అధికారికంగా కుటుంబ సమస్యలు, వ్యాధులు, అప్పుల బాధలను ఆత్మహత్యలకు కారణలుగా చెబుతున్నప్పటికీ అసలు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అని చెప్పకతప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రజల మీద పెనుభారాన్ని మోపుతున్నాయి. దీంతో కుటుంబాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నాయి.

ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో దినసరి కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో ఉన్నారు. 2022లో నమోదైన గణాంకాల ప్రకారమే మొత్తం ఆత్మహత్యల్లో మూడో వంతు ఆత్మహత్యలు రోజువారీ కూలీలవే. ఇది వారి ఆర్థిక అస్థిరత, సామాజిక భద్రతా లోపానికి నిదర్శనం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతపై ప్రభావం చూపుతోంది. అన్నదాతల పరిస్థితి కూడా ఇంతే! పంటలకు గిట్టుబాటుధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ప్రాణలు తీసుకుంటున్నారు. వివిధ నివేదికల ప్రకారం 2014లో రాష్ట్రంలో 233 మంది రైతులు ఆత్యహత్యలు చేసుకోగా, 2022 నాటికి ఆ సంఖ్య 524కు చేరింది. ఒకవైపు అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటుంటే, జీవనోపాధి లేక దినకూలీలు ఆత్మహత్యల బాట పడుతున్నారు. విద్యార్థులది మరో విషాద గాధ. 2022 సంవత్సరంలో 575 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం విద్యా వ్యవస్థలోని క్రూరత్వానికి నిదర్శనం. కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అమానుష ఒత్తిడి పెడుతున్నాయి. విద్యార్థులలో తీవ్రస్థాయిలో అలజడి చెలరేగినప్పుడు కంటితుడుపు మాటలు చెబుతున్న నేతలు ఆ తరువాత వాటిని విస్మరిస్తుండటం దీనికి కారణం. మత్తు పదార్థాలకు బానిసలైన వారు చేసుకుంటున్న ఆత్మహత్యలు కూడా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇక 2022లో చోటుచేసుకున్న మొత్తం 8,908 ఆత్మహత్యల్లో 2,141 మహిళలవే! ఈ పరిస్థితి దేనికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆత్మహత్యలు వ్యక్తిగత బలహీనతలు కావు. వాటిని ప్రభుత్వాల విధానాలు, సమాజ బలహీనతల ఫలితంగానే చూడాలి! ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల పట్ల సానుభూతి చూపడం కన్నా ముందుగా ఆ పరిస్థితి రాకుండా చూడటం అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగానే పాలకులకు ఉంటే ఆ దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ముందుగా మానసిక, ఆరోగ్య వసతులను బలోపేతం చేయాలి. హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై విస్తృత ప్రచారం చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సష్టించాలి. రైతులకు రుణ విముక్తి, ఉపాధి హామీ పనులకు నిధుల పెంపు, కార్మికులకు భద్రత, విద్యార్థులకు ఒత్తిడి రహిత విద్య అందుబాటులోకి తేవాలి. నిజానికి ఇవన్నీ ప్రజల హక్కులే. వాటిని సాధించుకోవడం కోసం సమాజంలోని అందరూ కలిసి కదలాలి. ప్రభుత్వంపై ఒత్తిడితీసుకువచ్చి వాటిని సాధించాలి. లేనిపక్షంలో బలవన్మరణాల జాబితా మరింతగా పెరగుతుంది!

# ఖమ్మంలో రోప్‌వే, తీగల వంతెన, రిటైనింగ్ వాల్స్

**ఖమ్మం, తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. అయితే వేగం పుంజుకోకపోవడానికి కారణం.. భూసేకరణ సమస్య. ఈ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాకు వచ్చిన తర్వాతనే అక్కడ చుట్టుపక్కల ప్రాంతాల స్థలాలకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిర్మాణాలకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు యజమానులు ఒప్పుకోవడం లేదు. ధరలు అధికంగా ఉండటంతో.. ప్రభుత్వానికి స్థలాలు అప్పగించేందుకు నిరాకరిస్తున్నారు. అయితే దీనిపై త్వరలోనే కదలికి వచ్చి.. ప్రాజెక్ట్ పనులు పూర్తి కానున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు ఊపందుకోవడంలో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో నిర్వాసితులను ఒప్పించడం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ.. భూసేకరణలో ఎదురయ్యే ప్రతిబంధకాలు వేగాన్ని తగ్గిస్తున్నాయి.ఖమ్మం ఖిల్లాలో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోప్‌వే ప్రాజెక్ట్ మొదటి అడ్డంకిని అధిగమించింది. తొమ్మిది ఇళ్లకు పరిహారం అందించడంతో నిర్మాణం కోసం మార్గం సుగమమైంది. నాలుగు క్యాబిన్ల తయారీ, టవర్ల పనులు వర్క్‌షాప్‌లో జరుగుతున్నాయి. లోయర్, అప్పర్ స్టేషన్లు సిద్ధం చేస్తే 2026 ఆగస్టు నాటికి రోప్‌వే ప్రజలకు అందుబాటులోకి రానుంది.గతేడాది మున్నేరు నది ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలు మునిగిపోయాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల రిటైనింగ్ గోడలు నిర్మిస్తోంది. ఇందుకోసం 239 ఎకరాల భూమి అవసరం. ప్రభుత్వ భూమిపై కొంతమేర పనులు పూర్తవగా.. ప్రైవేటు భూమి సేకరణలో ఆటంకం తలెత్తింది.



అధికారులు 2026 జూన్ లోగా ఈ పనులు ముగించాలని నిర్ణయించారు.నగర శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.239 కోట్లతో భూగర్భ మురుగుకాల్వలు మరియు ఎస్టీపీలు నిర్మిస్తున్నారు. పుట్టకోటలో 9.50 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్‌కు సమస్యలు లేకపోవడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే ధంసలాపురంలో ప్రైవేటు భూమి కారణంగా అడ్డంకులు ఎదురవుతున్నాయి.హైదరాబాద్ తరహాలో రూ.183 కోట్లతో ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో తీగల వంతెన నిర్మాణం జరుగుతోంది. 167 సెగ్మెంట్లలో ఇప్పటివరకు 100 ఏర్పాటు చేశారు. వరదల కారణంగా కొన్ని పనులు ఆగిపోవడంతో ఆలస్యం ఏర్పడింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోక, కాంట్రాక్టర్లు పనులు నెమ్మదిగా కొనసాగిస్తున్నారు. 2026 మార్చి నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, గృహ యజమానులకు ప్రత్యామ్నాయ స్థలాలను అందించేందుకు సర్కారు వెంచర్‌ను సిద్ధం చేస్తోంది. దీంతో భూసేకరణపై ఉన్న అభ్యంతరాలు తొలగి, పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# రాజాసింగ్ కు అర్థమైనట్టుందే..!



**హైదరాబాద్,, తెలంగాణ దిశ:**బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇప్పుడు బీజేపీ చుట్టూ తిరుగుతున్నారు. తాను రాజీనామా చేసినందుకు యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారని ఆయన చెబుతున్నారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ హైకమాండ్ నుంచి కొంత మంది తనతో టచ్ లో ఉన్నారని వారు ఎప్పుడు ఆహ్వానిస్తే అప్పుడు బీజేపీలో చేరుతానని ప్రకటించారు. అయితే ఇప్పుడు కూడా ఆయన కిషన్ రెడ్డిపై తీవ్ర విమర్శలుచేస్తున్నారు. పార్టీకి రాజీనామా చేసిందున.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కొంత మంది బీజేపీ నేతలు ఆయనను డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రాజాసింగ్ స్పందించారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయబోనని, కిషన్ రెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేస్తే తానూ రాజీనామా చేసి, ఇద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేసి ఎవరి బలం ఏమిటో నిరూపించుకుందామని సవాల్ విసిరారు. "తెలంగాణలో బీజేపీ నాశనం అయింది కిషన్ రెడ్డి వల్లే. ఆయనే వెనుక ఉండి తనపై తప్పుడు చేయిస్తున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు రబ్బర్ స్టాంప్ లా పని చేస్తు న్నారని ఆరోపించారు. తాజాగా ఆయన ప్రకటించిన రాష్ట్ర కమిటీపై రాజాసింగ్ విమర్శలు గుప్పించారు. ఆ కమిటీ వేసింది ..రామచంద్రరావా..కిషన్ రెడ్డా అని ప్రశ్నించారు. ఈ కమిటీతో తెలంగాణలో బ జేపీ అధికారంలోకి వస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటాన్నారు. "బీజేపీకి ఎవరు అధ్యక్షుడు అయితే తెలంగాణలో అధికారంలోకి వస్తుందో త్వరలో మరో ప్రెస్ మీట్‌లో చెప్తాను" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడిన ఆయనకు ఆ చాన్స్ దక్కకపోవడం, తనకు నామినేషన్ వేసే చాన్స్ కూడా ఇవ్వలేదని ఆరోపిస్తూ.. పార్టీకి రాజీనామా చేశారు. పదే పదే ఆయన పార్టీని ధిక్కరించి పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నందున.. ఆయన రాజీనామాను పార్టీ హైకమాండ్ కూడా వెంటనే అంగీకరించింది. దాంతో ఆయన మాజీ బీజేపీ నేత అయ్యారు. అయితే ఆయన వేరే పార్టీల్లో చేరట్లేదు. తనకు బీజేపీ తప్ప మరో పార్టీ సరిపడదని అంటున్నారు. ఆయన ఇప్పటికీ రాష్ట్ర నేతలపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. పార్టీతో సంబంధం లేకుండానే ఇలా చేస్తున్న ఆయనకు.. పార్టీలోకి రానిస్తే మరింత రచ్చ చేస్తారని.. ఆయనను పార్టీలోకి ఆహ్వానించేందుకు ఎవరూ సిద్ధపడే అవకాశం లేదు. సైలెంట్ గా ఉండి.. మళ్లీ బీజేపీలో చేరాల్సిన ఆయన.. పదే పదే రాష్ట్ర నేతలపై విమర్శలు చేస్తూ.. బీజేపీలోకి తనకు ఎంట్రీ లేకుండా చేసుకుంటున్నారని బీజేపీ నేతలు అంటున్నారు.

# కన్నడరాని ఆటోవాలాలకు కష్టాలు



బెంగలూరు, : ఇటీవల తెలంగాణలో మార్వాడీ గో బ్యాక్ అన్న నినాదాలు వినిపించాయి. బంద్‌లు జరిగాయి. తమ కిరాణా వ్యాపారాలకు వారు అడ్డు వస్తున్నారన్నకారణంగా స్థానిక వ్యాపారులు వ్యతిరేకతను చాటారు. అయితే పరిస్థితి సద్దుమణిగింది. కర్ణాటక ప్రజలకు తమ భాషతో పాటు- తమ సంస్కృతిపై ఉన్న ఎనలేని అభిమానం గురించి మనకు తెలిసిందే. దీనికి తోడు చాలా కాలం నుంచి స్థానిక ప్రజలకు ఉపాధి అనే మరో అంశం కూడా వారి మదిలో అలాగే నాటుకుపోయింది. పెద్ద ఉద్యోగం అయినా లేక చిన్న రోజువారీ పని అయినా తమ నేలపై తమ వారికే దక్కాలనే ఆలోచన చాలా మంది కన్నడిగుల్లో ఉంది. ఈ క్రమంలోనే తాజాగా బెంగళూరులో కొత్త నినాదం ఊపిరి పోసుకుంది. కన్నడ మాట్లాడని ఆటోవాలాలు అంటే వేరే ప్రాంతం నుంచి వచ్చి ఉపాధి పొందుతున్న వారిని టార్గెట్ చేస్తూ ఆటోల వెనుక స్టిక్కర్లు వెలియటంపై దుమారం కొనసాగుతోంది. అనధికారికంగా ఆటోలు నడుపుతున్న

### వారు ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని ప్రకటనలు

హిందీవాలాస్ గో బ్యాక్ అంటూ అందులో ఉంది. పర్మిట్లు-, పోలీస్ వెరిఫికేషన్, డిస్ ప్లే, బ్యాడ్జి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు కూడా ఆటోలు నడుపుతున్నారంటూ అందులో ఉంది. బెంగళూరులోని కేఆర్ పురమ్, మహదేవ్‌పురా ప్రాంతాల్లో దాదాపు ఇలాంటి ఆటోల సంఖ్య 10 వేలకు పైనే ఉన్నాయని స్టిక్కర్లో ఉంది. సోషల్ మీడియాలో ఇది తెగ వైరల్ అవుతుండటంతో చాలా మంది తమ అభిప్రాయాన్ని పంచుకుంటు న్నారు. ఇలాంటి స్టిక్కర్లు చూడటం బాధగా ఉందని,

మరీ ఇంత విద్వేషం పరికిరాదంటూ నమ్మబెంగళూరు అనే అకౌంట్లో పోస్టుపై క్యాప్షన్ పెట్టబడింది. కొందరు యూజర్లు ఉపాధి కోసం వచ్చిన వ్యక్తులు స్థానిక బాషతో పాటు- కల్చర్ నేర్చుకుంటే సరిపోతుందని దీనికోసం ఇలా పోస్టర్లు వేసి మరీ రచ్చ చేయటం సరికాదని అంటున్నారు. మరో వ్యక్తి మాట్లాడుతూ అందరూ సొంత కార్లలో ప్రయాణం వల్ల ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయని, బెంగళూరులో ప్రజలు విచక్ష కోల్పోయి ప్రవర్తిస్తు న్నారన్నారు. జంతువులు కూడా మనుషుల కంటే మంచిగా కలిసి జీవిస్తున్నాయని రాసుకొచ్చారు.

మరొకరు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో బెంగళూరు ప్రస్తుతం వివాదాలకు అడ్డాగా మారిందటూ పోస్ట్ చేశారు. మరొకరు బెంగళూరు ప్రత్యేక దేశంగా కొందరు ఫీలవుతున్నారని.. ఇతర ప్రాంతాల ప్రజలపై ఇలా విషం కక్కటం సరికాదంటూ పోస్ట్ పెట్టారు. బెంగళూరులో ఆటో డ్రైవర్లు మీటర్లు లేకుండా నడపటం అక్రమం కాదా అంటూ మరొకరు ప్రశ్నించారు. మొత్తంగా ప్రాంతీయవాదం వివిధ రకాల్లో పొంచివుంది. దీనిని గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది.


# అమ్మో..కేఎఫ్సీ నా..?

**నిజామాబాద్, తెలంగాణ దిశ :** ఫ్రైడ్ చికెన్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. కారంగా.. క్రిస్పీగా.. ఇంకొంచెం ఘాటుగా.. వేడివేడి చికెన్ ముక్కలను లొట్టలు వేసుకుంటూ తింటూ.. అందులోకి కూల్ డ్రింక్ తాగుతూ ఆస్వాదించేవారు చాలామంది ఉంటారు. సాయంత్రం సమయంలో చల్లగా ఉన్న వాతావరణాన్ని.. ఇలాంటి వేడి ఫుడ్ తింటూ చాలామంది ఆస్వాదిస్తూ ఉంటారు. అందువల్లే కేఎఫ్ సీ రెస్టారెంట్లు సాయంత్రం సమయంలో విపరీతమైన రద్దీగా ఉంటాయి. దీనికి తోడు కేఎఫ్ సీ లో వినియోగదారులు కోరుకున్నట్టుగా చికెన్ లో వైరైటీలు లభిస్తుంటాయి.. లెగ్ పీస్, జాయింట్ వింగ్స్, చెస్ట్ పీస్ లు.. ఇలా రకరకాల వెరైటీలు అందుబాటులో ఉంటాయి. ఈ తరహా చికెన్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నప్పటికీ చాలామంది వినిపించుకోరు. పైగా లొట్టలు వేసుకుంటూ తింటారు.అనేక సందర్భాలలో అనేక సందర్భాలలో కేఎఫ్ సీ లో చికెన్ ఆరోగ్యానికి మంచిది కాదని.. అందులో హానికరమైన పదార్థాలు ఉన్నాయని మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ చాలామంది పట్టించుకోరు. ఎక్కడో జరిగింది కదా.. ఇక్కడైతే కాదు కదా అని సర్ది చెప్పుకుంటారు. పైగా భారీ ఆర్డర్లు పెట్టి తమ కడుపును నింపుకుంటారు. చికెన్ మాత్రమే కాదు శీతల పానీయాలు కూడా విపరీతంగా తాగుతుంటారు. అందువల్లే మనదేశంలో కేఎఫ్ సీ రెస్టారెంట్లు విపరీతంగా ఉంటాయి. సినిమా థియేటర్లు.. పెద్దపెద్ద మాల్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాలేజీలు ఉన్నచోట.. హాస్టల్స్ ఉన్నచోట కే ఎఫ్ సీ రెస్టారెంట్లకు కొదవ ఉండదు. ఓ నివేదిక ప్రకారం మనదేశంలో కే ఎఫ్ సీ ప్రతి ఏడాది వందల కోట్ల వ్యాపారం చేస్తూ ఉంటుంది. ఇంకా తన వ్యాపారాన్ని విస్తరిస్తూనే ఉంది. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కే ఎఫ్ సీ రెస్టారెంట్ కు సంబంధించి ఒక దారుణమైన నిజం వెలుగులోకి వచ్చింది.తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ నగరంలో వేణు మాల్ లో ఇటీవల కొందరు చికెన్ లెగ్ పీస్ ఆర్డర్ చేశారు. అది తింటూ ఉండగా కుళ్ళిపోయిన వాసన వచ్చింది. దీంతో ఒక కస్టమర్ వచ్చి నిర్వాహకులను నిలదీశాడు. దీంతో వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీనికి తోడు వింగ్స్ ఆర్డర్ పెట్టిన వ్యక్తికి కూడా ఇలాంటి అనుభవం ఎదురయింది. దీంతో అతడి కూడా నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కస్టమర్లు ఇలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ రెస్టారెంట్ నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. పైగా వెగిలిగా నవ్వారు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో సంచలనం సృష్టిస్తోంది.



# పిల్లల చదువులపై జీఎస్టీ వాత..

## టెక్ట్స్‌బుక్స్‌తో పాటు స్కూల్ ఫీజులు కూడా పెరిగే ఛాన్స్!




హైదరాబాద్, : జీఎస్టీలో విప్లవాత్మకమైన సవరణలు తీసుకొచ్చి పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగించామని కేంద్రంలోని ఎన్డీయే సర్కారు గొప్పలకు పోతున్నది. నిజానికి ప్రభుత్వ తాజా నిర్ణయాలతో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. జీఎస్టీలో (వస్తు, సేవల పన్ను) విప్లవాత్మకమైన సవరణలు తీసుకొచ్చి పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగించామని కేంద్రంలోని ఎన్డీయే సర్కారు గొప్పలకు పోతున్నది. నిజానికి ప్రభుత్వ తాజా నిర్ణయాలతో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పిల్లల స్కూల్ ఫీజుల విషయానికే వస్తే, జీఎస్టీ తాజా సవరణలతో స్కూల్ ఫీజుల భారం, టెక్ట్స్‌బుక్స్ రేట్లు అమాంతం పెరిగే ప్రమాదం ఉన్నదని ఆర్థిక విశ్లేషకులు చెప్తున్నారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కోసం తీసుకొనే కోచింగ్, ఆన్‌లైన్ క్లాసులు, ట్యూషన్ ఫీజుల్లో కూడా ఏ మాత్రం ఊరట దక్కలేదని వివరిస్తున్నారు.

వాత పెట్టారిలా..: స్కూల్, కాలేజీల ఫీజులపై ఎలాంటి జీఎస్టీ భారం ఉండదని పైకి చెప్తున్న కేంద్రప్రభుత్వం.. పాఠశాల నిర్వహణ ఖర్చులపై మాత్రం ట్యాక్సుల మోత మోగించింది. సప్లిమెంటరీ ఎడ్యుకేషన్ కిందకు వచ్చే స్కూల్‌లో వినియోగించే ఐటీ సేవలు, క్లీనింగ్, సెక్యూరిటీ, మెయింటెనెన్స్, డెవలప్‌మెంట్ తదితరాలపై గతంలో 12 శాతంగా ఉన్న జీఎస్టీని ఇప్పుడు 18 శాతానికి పెంచింది. ప్రస్తుతం ట్యూషన్ ఫీజుతో పాటు సెక్యూరిటీ, స్కూల్ డెవలప్‌మెంట్, టెక్, ల్యాబ్ సర్వీసులు ఇలా అన్నింటినీ కలిపి స్కూల్ ఫీజుగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. తాజాగా సప్లిమెంటరీ ఎడ్యుకేషన్‌పై కేంద్రం జీఎస్టీని పెంచడంతో పిల్లల స్కూల్ ఫీజులు మరింతగా పెరిగే ప్రమాదం ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ యాజమాన్యాలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ని క్రెడిట్ చేసుకోలేవు కాబట్టి, ఈ పెరిగిన ఖర్చులు ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారాన్ని మిగల్చడం ఖాయమని విద్యావేత్తలు చెప్తున్నారు.

టెక్ట్స్‌బుక్స్‌పై భారమిలా..: నోట్‌బుక్స్‌పై జీఎస్టీని ఎత్తేసిన కేంద్రం.. టెక్ట్స్‌బుక్స్, ప్రింటెడ్ స్టడీ మెటీరియల్‌పై మాత్రం 12 శాతంగా ఉన్న జీఎస్టీని 18 శాతానికి పెంచింది. దీంతో స్కూల్ పిల్లల టెక్ట్స్‌బుక్స్, కోచింగ్‌కు ప్రిపేరయ్యే విద్యార్థుల స్టడీ మెటీరియల్ ధరలకు రెక్కలు రానున్నాయి. కేంద్రం తాజా నిర్ణయంతో టెక్ట్స్‌బుక్స్, మెటీరియల్ ధరలు 10 శాతం నుంచి 15 శాతం మేర పెరిగే ప్రమాదం ఉన్నదని ది ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ (ఓపీఏ) జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ కమల్ మోహన్ చోప్రా అభిప్రాయపడ్డారు. ఇది దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది విద్యార్థులపై, వారి కుటుంబ సభ్యులపై ఆర్థిక భారాన్ని మోపుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై కేంద్రం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

కోచింగ్‌లు ప్రియమే!: ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ట్యూషన్లు, ఆన్‌లైన్ కోర్సులు–లెర్నింగ్ ప్లాట్‌ఫాంలపై జీఎస్టీని కేంద్రం 18 శాతంగానే కొనసాగించింది. దీంతో జేఈఈ, నీట్, సివిల్స్, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో చేరాలనుకొనే వారికి, ఆన్‌లైన్ లెర్నింగ్, క్లాసులు వినే విద్యార్థులకు ఫీజుల విషయంలో ఊరట దక్కలేదనే చెప్పాలి. ఉదాహరణకు.. జేఈఈలేదా నీట్ కోచింగ్ కోసం ఒక విద్యార్థి రూ. 50వేలు ఫీజు కడితేదానికి జీఎస్టీ రూపంలో రూ9 వేల వరకూ అదనంగా చెల్లించాల్సిందే. మధ్యతరగతి కుటుంబాలకు పెను భారమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం తీసుకొన్న నిర్ణయాలపై పునరాలోచన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చికాగోలో స్వామి వివేకానందుడి చరిత్రాత్మక ప్రసంగానికి 132 ఏళ్లు

## -సర్వమత సమ్మేళనానికి తొలిసారిగా హాజరైన స్వామి వివేకానందుడు

1893లో చికాగో వేదికగా జరిగిన సర్వమత సమ్మేళనానికి తొలిసారిగా హాజరైన స్వామి వివేకానందుడు.. ఒక్క మాటతోనే ప్రపంచాన్ని భారతవైపు తిప్పుకునేలా చేశారు. చికాగోలో సర్వమత సమ్మేళనం 1893, సెప్టెంబరున ప్రారంభమైంది. ఈ మహాసభకు వివిధ దేశాలకు చెందిన వేలాది మంది ప్రతినిధులు హజరయ్యారు. వీరందరిలో కెల్లా భారత్ తరఫున పాల్గొన్న స్వామి వివేకానంద పిన్న వయస్కుడు. ఈ సమ్మేళనానికి హాజరైన వారంత తమ ప్రసంగ పాఠాలను ముందుగానే తయారు చేసుకున్నారు. అయితే స్వామిజీ దగ్గర అలాంటిదేమి లేదు. అందుకే తన ప్రసంగాన్ని చివరలో ఉంచమని సభాధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. అయితే వివేకానందుడు దాదాపు రెండు నెల ముందే అమెరికా చేరుకున్నారు.స్వామిజీ చికాగో నగరానికి జూలైలోనే చేరుకొన్నారు. కానీ విశ్వమత సభలు సెప్టెంబరులో ప్రారంభమవుతాయని, ఆ సభల్లో పాల్గొనడానికి ధ్రువ ప్రత్రాలు తప్పనిసరి అని, అవి ఉన్నా వక్తలను అనుమతించే సమయం ఎప్పుడో దాటి పోయిందని తెలిసి బాధపడ్డారు. అక్కడి వాతావరణానికి తట్టుకోలేక ఇబ్బంది పడ్డారు.

బోస్టన్ నగరంలో ఖర్చు తక్కువని ఎవరో చెప్పగా విని అక్కడకు రైలులో వెళ్లారు. బోస్టన్ చేరుకున్న వివేకానందుడికి హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జేహెచ్ రైట్స్‌తో పరిచయం ఏర్పడింది. విశ్వమత సభలో పాల్గొనడానికి తనకు అనుమతి పత్రం కావాలని స్వామిజీ ఆ ప్రొఫెసర్‌ను అడిగితే... మిమ్మల్ని ధ్రువపత్రం అడగడమంటే "సూర్యుడికి ప్రకాశించే హక్కు ఎవరిచ్చారని అడగడమే" అని చెప్పి "ఈ వ్యక్తి మేధస్సు, పాండిత్యం మన దేశంలోని గొప్ప గొప్ప పండితులను అందరిని కలిపితే వచ్చే పాండిత్యం కన్నా చాలా గొప్పదని అందులో రాశారు.అమెరికా సోదర సోదరీ మణులారా..


Swami Vivekananda at the World Parliament of Religions, Chicago, 1893

అని స్వామీ వివేకానంద తన ప్రసంగాన్ని ప్రారంభించగానే దాదాపు మూడు నిమిషాల పాటు కరతాల ధ్వనులతో ప్రాంగణం దద్దరిల్లింది. వివేకానందుడి ప్రేమ పూర్వక పిలుపునకు సభికులు దాసోహం అన్నారు. భారతీయ ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుందని, చిన్న చిన్న నదులు ప్రవహించి చివరికి సముద్రంలో చేరిన విధంగా అన్ని మతాల గమ్యం భగవంతుడిని చేరుకోవడమేని అన్నారు. దీని కోసం ఎవరూ మతం మార్చుకోవాల్సిన అవసరం లేదని, తమ మతం మాత్రమే గొప్పదని భావించే వారు బావిలో కప్పల లాంటి వారని వ్యాఖ్యానించారు. ఆ అద్భుత ప్రసంగం శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో స్వామిజీ గొప్పదనమే కాదు, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చింది. ఫోటోతో పాటు స్వామి వివేకానంద –ది సైక్లోనిక్ మాంక్ ఆఫ్ ఇండియా అని పోస్టర్స్ ముద్రించి చికాగో నగరంలో వేలాడదీశారు. ఇది జరిగి నేటికి 132ఏళ్లు పూర్తయింది.

# విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపనతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గణపురం మండలం, గాంధీ నగర్ లోని మహాత్మా జ్యోతి బా పూలే బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాలపై అవగాహన, సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నిర్వహణను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 10 వ తరగతి విద్యార్థులతో మమేకమై ఎలా ఉన్నారు, బాగా చదు వుతున్నారా, ఉదయం ఏమి తిన్నారు, ఆహారం బావుంటుందా, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఆటలు ఆడుతున్నారా అంటూ ఆరా తీశారు.పాఠశాలలో విద్యార్థుల విద్య, భోజన, పాఠశాల వాతావరణం, బోధన విధానాలను కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రహరి నిర్మాణం, డ్యుయల్ డెస్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని ప్రతిభను పెంపొందించుకోవాలని ఆయన ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కిచెన్, వంట సామాన్లు భద్రపరచు గదులను పరిశీలించారు. వంట సామాన్లు భద్రపరచుకు ఇనుప కేజ్ ఏర్పాటు చేయడం బావుందని అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్, ఎస్ ఓ స్వప్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి కొనుగోలుకు ని'బంధనాలు'



## మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు
## తరువాత బోనస్ అంటూ ప్రకటన
## ఇ-క్రాప్ సర్టిఫికెట్ ఉంటేనే డబ్బులు
## ఆందోళనలో రైతులు

**కర్నూలు, తెలంగాణ దిశ :** ఉల్లి కొనుగోళ్లలో నిబంధనలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు చేసింది. ఆ తర్వాత నుంచి వ్యాపారుల దాయాదాక్షిణ్యాలకే వదిలేసింది. క్వింటాలు ఉల్లిని రూ. 1,200 కంటే తక్కువకు వ్యాపారులు కొంటే, ఆ వ్యత్యాసపు ధరను తర్వాత భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. మిర్చి విషయంలోనూ ప్రభుత్వం అప్పట్లో ఈ విధంగా హామీ ఇచ్చినా అమలు కాలేదు. అదే విధంగా ఉల్లి బోనస్‌కు సంబంధించి ఏడేళ్ల క్రితం బకాయిలు ఇప్పటికీ చెల్లింపు జరగలేదు. దీంతో, ప్రభుత్వం మాటలపై ఉల్లి రైతుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా, ఈ ఏడాది 26,696 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ. 1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. గతేడాది గరిష్టంగా క్వింటాలుకు రూ. 3,989 రాగా, ఈ ఏడాది రూ. 1,599 మాత్రమే వచ్చింది. గతేడాది కనిష్టంగా క్వింటాలుకు రూ. 679 రాగా, ఈ ఏడాది రూ. 501కి పడిపోయింది. దీంతో, రైతులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం స్పందించి క్వింటాలు ఉల్లిని రూ. 1200కు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించింది. ఈ ధర రైతులకు ఏ మాత్రమూ గిట్టుధర కావడం లేదు. ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు మొత్తం 1,226 టన్నుల ఉల్లిని మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. నిల్వ చేసుకోవడానికి అవకాశం లేదనే సాకుతో నాల్గో తేదీ నుంచి కొనుగోలు నిలిపివేసింది. వ్యాపారులకే అమ్ముకోవాలని తేల్చి చెప్పింది. హోటళ్ల యాజమాన్యాలు, బడా వ్యాపారులు కొనుగోలు చేయాలని కోరింది. ట్రేడర్లు రూ. 1200 కంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆ వ్యత్యాసం మొత్తాన్ని బోనస్‌గా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతోపాటు రైతు భరోసా కేంద్రం నుంచి ఇ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని నిబంధన పెట్టింది. దీంతో ఇ-క్రాప్ నమోదు చేయని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నిబంధన వల్ల కౌలు రైతులు కూడా తీవ్ర ఆం దోళన చెందుతున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఆదివారం ఉల్లికి బహిరంగ వేలం నిర్వహించగా 12 మంది చిన్న వ్యాపారులు మాత్రమే కొన్నారు. దీంతో, నిల్వలు అలాగే ఉండిపోయాయి. 2017లో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు అప్పటి టిడిపి ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఆ మొత్తాన్ని ఇప్పటి వరకూ కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు.

రూ. 5 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో, ఇప్పుడు చెబుతున్న బోనస్ కూడా జమ చేస్తుందో? లేదో? అని రైతులు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధర భారీగా పడిపోయింది. గత సెప్టెంబర్‌లో అత్యధికంగా క్వింటాలు ఉల్లి రూ. 4,389 పలికింది. ఈ సెప్టెంబర్‌లో ఇప్పటి వరకూ అత్యధికంగా రూ. 1,359 మాత్రమే లభించింది. కనిష్ట ధర క్వింటా రూ. 100 మాత్రమే పలికింది.

# ఆటాడుకుంటున్న రుతుపవనాలు..
# అయితే కుండపోత.. లేదంటే కరవు!

**దేశంలో వింతగా మారిన రుతుపవనాల తీరు**
**వాతావరణ మార్పులు ఒక కోణం మాత్రమేనన్న నిపుణులు**
**పట్టణ ప్రణాళిక, డ్రైనేజీ లోపాలే వరదలకు కారణం**
**హిమాలయ రాష్ట్రాల్లో కుండపోత.. గంగా మైదానాల్లో కరవు**
**కాంక్రీట్ వినియోగంతో భూమిలోకి ఇంకని వర్షపు నీరు**

ఢిల్లీ,: దేశంలో ఈ ఏడాది రుతుపవనాల గమనం వింతగా ఉంది. దేశంలోని కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం అవుతుంటే.. మరికొన్ని ప్రాంతాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఈ విపత్కర పరిస్థితులకు వాతావరణ మార్పులు మాత్రమే కారణం కాదని, మన పట్టణ ప్రణాళికల్లోని లోపాలే కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐఐటీ భువనేశ్వర్ నిపుణులు చెబుతున్నారు. ఐఐటీ భువనేశ్వర్‌కు చెందిన స్కూల్ ఆఫ్ ఎర్త్, ఓషన్–క్లైమేట్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సందీప్ పట్నాయక్ ఈ అంశంపై కీలక విషయాలు వెల్లడించారు. దేశంలో సంభవిస్తున్న విపత్తులకు వాతావరణ మార్పు అనేది ఒక కోణం మాత్రమేనని అన్నారు. నగరాల్లో సరైన ప్రణాళిక లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడం, మితిమీరిన కాంక్రీట్ వాడకం వంటివి తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయని వివరించారు. దీనివల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేక, నగరాలు తేలికగా ముంపునకు గురవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతంలో నాటకీయమైన మార్పులు కనిపించాయని పట్నాయక్ పేర్కొన్నారు. పాశ్చాత్య అవాంతరాల కారణంగా జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఉత్తరాఖండ్, బీహార్ రాష్ట్రాల్లో అయితే భారీ వరదలకు గ్రామాలు కొట్టుకుపోయి వందల మంది గల్లంతయ్యారు. దీనికి పూర్తి విరుద్ధంగా, గంగా మైదాన ప్రాంతాలు జూన్‌లో వర్షం లేక ఎండిపోగా, మధ్య భారతదేశం మాత్రం భారీ వర్షాలతో తడిసిముద్దయింది. హిమాలయ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఎక్కువగా ఆవిరై, వాతావరణంలో తేమ పెరుగుతోందని పట్నాయక్ వివరించారు. దీనివల్ల మేఘాలు దట్టంగా మారి,
బరువెక్కి కుండపోత వర్షాలుగా కురుస్తున్నాయని, ఇవే కొండచరియలు విరిగిపడటానికి కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా, బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన వ్యవస్థ, రుతుపవనాలు కలిసి పర్వత ప్రాంతాల్లో గాలుల దిశను మార్చివేస్తున్నాయని, ఈ కారణంగానే కేరళలో కొండచరియలు విరిగిపడి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయన విశ్లేషించారు.

# కలెక్టర్‌ను కలిసేందుకు ప్రహరీ దూకిన విద్యార్థులు



## అడ్డుకుని గురుకులానికి పంపిన పోలీసులు
## వనపర్తి జిల్లా చిట్యాలలో ఘటన

**వనపర్తి, తెలంగాణ దిశ :** తమ సమస్యలను పరిష్కరించాలంటూ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రహరీ దూకి కలెక్టరేట్‌కు పరుగులు తీసిన ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. చిట్యాలలోని మహాత్మా జ్యోతిబాఫూలే (బీసీ గురుకుల) పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ క్రమంలో కలెక్టర్‌కు వినతిప్రతం రాశారు. 'ప్రిన్సిపాల్ గురువయ్య.. విద్యార్థులను దుర్భాషలాడుతున్నాడు. అవసరం లేకున్నా తల్లిదండ్రుల నుంచి రకరకాల వస్తువులు ఇప్పించడానికి సిబ్బందితో కలిసి డబ్బులు వసూలు చేస్తున్నారు. పాఠశాలకు వచ్చే తల్లిదండ్రులతో మమ్మల్ని తిట్టిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రిన్సిపాల్, వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలి' అంటూ ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. 70 మంది పదోతరగతి విద్యార్థులు ఈ పత్రంతో మంగళవారం ఉదయం 9:30 గంటల తర్వాత గురుకు ల పాఠశాల ప్రహరీదూకి వనపర్తి జిల్లా కేంద్రానికి పరుగులు పెట్టారు. పాఠశాల ఆవరణలోని పంట పొలాల మీదుగా వెళ్తుండటంతో విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై వెంటనే వారిని అడ్డగించారు. పలువురు నాయకులు చేరుకుని విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థులకు ఆయన సర్దిచెప్పారు.

# జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలి


## పోలీసు అధికారులకు సూచనలు చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్, 13 వ తేదీన శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరుగుతుందని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. హెచ్. రమేష్ బాబు తెలిపారు. జిల్లాల్లోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గౌరవనీయులు జడ్జి గారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, వివాహ /కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను మరియు రాజీ పడదగు ఇతర కేసులు పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోర్టులలో పెండింగ్ లో ఉన్న తమ తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకొని లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. కోర్టులలో లేని కేసులను
ప్రీ- లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థ లో పరిష్కరించుకోవాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, ఎక్కువ కేసులు పరిష్కరించుటకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలనీ వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగరాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, సి.ఐ లు, ఎస్సై లు, కోర్టు కాన్స్టేబుళ్లు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# ఆదిలోనే అలర్ట్ అవ్వండి

మంచి మార్కులు సాధించాలి, క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం కొట్టాలి అని అందరూ చెబుతుంటారు. కానీ, ఆర్థిక విషయాల గురించి పిల్లలకు అవగాహన కల్పించరు. దీంతో మంచి కొలువు సాధించి.. రెండు చేతులా సంపాదిస్తున్నా%ా% మనీ మేనేజ్‌మెంట్‌లో చాలామంది విఫలం అవుతుంటారు. అలా కావొద్దంటే.. ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి. ఈ టిప్స్ ఫాలో అయితే.. మీ కష్టార్జితం వృథాపోకుండా ఉంటుంది. డబ్బు మాత్రమే లక్ష్యం కాకూడదు. కానీ, అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు డబ్బు సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల ఆఫీసుల్లో ఏవైనా బెనిఫిట్ ప్లాన్స్ ఆఫర్ చేస్తే, అందులో చేరి డబ్బును ఆదా చేసుకోవాలి. కచ్చితంగా ఆ పొదుపు మొత్తం పెద్ద అవసరానికి ఉపయోగపడుతుంది. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలోనే షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ పెట్టుకోవాలి. కుటుంబంతో విహారం, కారు, బైకు కొనడం గట్రా స్వల్పకాలిక లక్ష్యాలుగా భావించి అందుకు తగ్గ సేవింగ్స్ చేసుకోవాలి. ఇంటి నిర్మాణం, రిటైర్మెంట్ ప్లాన్ లాంటివి దీర్ఘకాలిక లక్ష్యాలుగా నిర్దేశించుకొని.. ప్రణాళిక మేరకు డబ్బులు కూడబెట్టాలి. మార్కెట్లో చాలామంది ఫైనాన్షియల్ అడ్వైజర్లు అందుబాటులో ఉన్నారు. వారిని సంప్రదించి వచ్చే జీతాన్ని ఎలా ఖర్చు చేయాలో ఒకసారి తెలుసుకోవడం మంచిది. దానివల్ల సంపాదన ప్రారంభమైన



మొదట్లోనే ఫైనాన్షియల్ ప్లానింగ్ అలవాటవుతుంది. పెట్టుబడి, రాబడిపై చిన్నవయసులోనే అవగాహన వస్తుంది.
ఎప్పటికప్పుడు మార్కెట్లో వస్తున్న స్కామర్లపై ఒక కన్నేసి ఉంచాలి. ఎలాంటి బెట్టింగ్, ఈజీ మనీ అవకాశాల వైపు మళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విషయంలో ఎంత బాధ్యతగా ఉంటే, భవిష్యత్తులో అంత ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది.

# దసరా తర్వాత దండయాత్రే..!

## వేముల మహేందర్ గౌడ్

**జయశంకర్ భూపాలపలి, తెలంగాణ దిశ :** బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిం చాలని, దసరా పండుగ లోపు బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే పండుగ తర్వాత లక్ష మందితో బీసీల రాజకీయ యుద్ధ భేరి మహాసభను నిర్వహించి ప్రభుత్వంపై దండ



యాత్ర చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహేందర్ గౌడ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 22 నెలలుగా బీసీలు రిజర్వేషన్లను పెంచాలని పోరాటం చేస్తుంటే..కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని, బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అంటుంటే..ఇంకొక వైపు మైనార్టీ రిజర్వేషన్లను బూచిగా చూపిస్తూ..కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు రిజర్వేషన్లను పెంచకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను పెంచాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మద్దతు ప్రకటిస్తున్న రాజకీయ పార్టీలు వాటి ఆమోదం కోసం చివరి వరకు కృషి చేయడం లేదన్నారు. రాజకీయ ఎజెండాతోనే పని చేస్తున్నారు తప్ప బీసీ రిజర్వేషన్లపై ఏ రాజకీయ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లను పెంచాలని ఇప్పటివరకు పార్టీలను గదుమ పట్టి అడిగామని, నేటి నుంచి ఎవరిని దేహి అని అడిగేది లేదని, నిలదీయడానికి దసరా తర్వాత పోరాటాలకు పురిటి గడ్డ అయినా భువనగిరిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనన్న నేతృత్వంలో లక్ష మందితో బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభను నిర్వహించి..రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలను భూస్థాపితం చేస్తామని మహేందర్ గౌడ్ హెచ్చరించారు.

# ట్రంప్ సుంకాలతో ఎదురుదెబ్బలు

## అమెరికన్ వ్యాపారవేత్తల ఆందోళన

వాషింగ్టన్: ఆదాయం పెంచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాలపై కొరడా ఝులిపిస్తే.. ఆ దెబ్బ అమెరికా కంపెనీలకే తగులుతోంది. దీంతో అక్కడి వ్యాపార కంపెనీలు లబోదిబోమంటున్నాయి. ఇది అమెరికాకు మేలు చేసేదెల ఉన్నా, ముందుగా తమ ఉనికికే ప్రమాదంగా మారిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అగ్రరాజ్యానికి చెందిన మెజారిటీ– కంపెనీలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే అందుకు కారణం. చైనా నుంచి అత్యధిక సుంకాలు వసూలు చేయాలని వాషింగ్టన్ భావించగా.. బీజింగ్ కూడా తాము తక్కువ తినలేదని ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోనున్నాయని షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో మొత్తం 254 కంపెనీల్లో మూడోవంతు పాల్గొన్నాయి. చైనాలో కొత్త సుంకాల వల్ల తాము అంచనా వేసిన ఆదాయం తగ్గుతుందని అవి పేర్కొన్నాయి. అయితే, బ్యాంకింగ్, కొన్నిరకాల ఇతర పరిశ్రమలు అమెరికా(÷ూఆ)కు ఎటు–వంటి ఎగుమతులు, దిగుమతులు చేయడం లేదు. ఇలాంటి కంపెనీలు దాదాపు మూడింట ఒక వంతు ఉన్నాయని తెలిసింది. వీటిపై మాత్రమే టారిఫ్‌ల భారం ఉండదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా దిగుమతులపై తొలుత అదనంగా 30 శాతం సుంకాలు విధించారు. తర్వాత వాటిని 145 శాతానికి పెంచారు. దీనిపై డ్రాగన్ కూడా దీటుగా స్పందించడంతో పరస్పర సుంకాలపై వెనక్కి తగ్గాలని ఇరు దేశాధినేతలు మేలో నిర్ణయించుకున్నారు. దీంతో చైనా 10 శాతం సుంకాలతో సరిపెట్టింది. నూతన టారిఫ్‌ల ప్రభావం చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే కంపెనీలు, అగ్రరాజ్యం నుంచి కొన్ని రకాల ముడిసరకు దిగుమతి చేసుకొనే కంపెనీలపై పడింది. వీటిలో ముఖ్యంగా రసాయన కంపెనీలు ఉన్నాయని షాంఘై ఛాంబర్ లీడర్స్ తెలిపారు. సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని ఆ బృంద అధ్యక్షుడు పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతు న్నాయి. సుంకాలు, ఇతర అంశాలపై ఏవిధంగా ముందుకెళ్తున్నారనే విషయంపై స్పష్టత రావడం లేదు. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిం చుకోవాల్సిన కంపెనీలకు ఈ అనిశ్చితి ఒక సవాలుగా మారిందని జెంగ్ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ చట్టాల ఆధారంగా సుంకాలు విధిస్తున్నారని, అవి చెల్లుబాటు కావని ఇప్పటికే పలు కోర్టులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. ఈ తీర్పులపై ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

### మెల్లగా స్వరం మారుస్తున్న ట్రంప్ భారత్‌తో సుంకాలపై చర్చిస్తామని సూచన

వాషింగ్టన్, : సుంకాలకు సంబంధించి ఇటీవలి వరకు భారత్‌పై ఘాటు– వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం రోజురోజుకు మారుతోంది. ఆయన మళ్లీ భారత్‌కు చేరువ కావాలని తపిస్తున్నారు. తాజాగా తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి తన పరిపాలన విభాగం ఇండియాతో చర్చలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై తన మిత్రుడైన భారత ప్రధాని మోదీతో వచ్చే కొన్ని వారాల్లోనే మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు– తెలిపారు. ఈ చర్చలు రెండు గొప్పదేశాలకు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నట్లు– వెల్లడించారు.
రష్యా నుంచి అధికస్థాయిలో భారత్ చమురును దిగుమతి చేసుకొని విదేశాలకు అమ్ముతూ ఇటీవలి వరకు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీ–వల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ–లు నిర్వహించారు. ఈ భేటీ– అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు– ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం
కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ గొప్ప ప్రధానమంత్రి అని కొనియాడారు. మోదీకి తానెప్పుడూ స్నేహితుడినన్నారు.

# జీవితం క్షణ భంగురం

**తిరుమల, తెలంగాణ దిశ :** మానవ జన్మ ఎక్కువ కాలం ఉండదు. ఈజీవితం బుద్భుదప్రాయం. ఉన్న కొద్ది కాలంలో మంచి అనిపించుకునేలా జీవించాలి. ఇలాంటి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. ఆదర్శంగా జీవితం గడపాలి. ఉన్న కాలాన్ని సక్రమంగా వాడుకోవాలి. 'దుర్లభో మానుషోదేహః' శరీరం లభించడమే చాలా కష్టం, 'దేహినాం క్షణ భంగురః' లభించినది ఒక క్షణమంత కూడా ఉండదు. ఇది మెరుపు కంటే కూడా ప్రమాదకరమైనది. మెరుపు ఎట్లా ఐతే పోయేదో, ఆ వెలుతురును పట్టించుకోం, అట్లానే శరీరం పోయేది అని తెలిసి కూడా దానికోసం ఎన్ని తప్పుడు పనులు చేస్తున్నామో గుర్తించాలి. పోయేదే అయినా ఇది పోయేది అని అనుకోనివ్వటం లేదు. కేవలం శరీరంకోసం బ్రతుకుతున్నాం అంటే ఇది ఎంత ప్రమాదమైనదో గుర్తించాలి. మెరుపు పోతుందని తెలుసు మనం వాడుకోం, అందుకే ఆ మెరుపే నయం. ఇట్లాంటి స్థితిలో మనం ఎన్నో జన్మలలో ఒకసారి మనిషి అయినప్పుడు దైవాన్ని గురించి ఆలోచించి, ఆ జ్ఞానాన్ని ఇచ్చే మహానుభావులని విశ్వసించి వారికి తగినట్లు బ్రతికగలిగితే, అట్లాంటి జన్మ కోటికి ఒకటైనా ఉంటుందో లేదో అని చెప్పవచ్చు. 'తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనం' మానవ జన్మలభించడమే గొప్ప అంటే, అట్లాంటి మానవ జన్మలో దైవాన్ని గుర్తించి బ్రతకడం, వైకుంఠ ప్రియులైన వారి దర్శనం లభించడం, వారి అభిమానం పొందటం ఎంత కష్టమో అనేది ఋషివాక్కు!! పరాశర మహర్షి వంటి వారికే అట్లా అనిపిస్తే ఇక మన గురించి ఆలోచించాలి. ఇవన్నీ మనిషికి చెప్పాల్సొచ్చింది, అది చెప్పడానికే రామావతారం. పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవుడు సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడేవే. వాటిని చదివి ఆ మార్గంలో పయనించినప్పుడే మానవ జన్మకు సార్థకత ఉంటుంది. మన జీవితం సుఖమయంగా సాగుతుంది.

# నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

## పర్యాటకులను కూడా వదలని ఆందోళనకారులు

ఖాట్మండ్,: నేపాల్‌లో జెన్–జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు– ఆస్తులకు ఆందోళనకారులు నిప్పటించారు. పోఖారా ప్రాంతంలో ఉన్న హోటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉపాసన గిల్ వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చారు. నిరసనలతో పోఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు– చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది

# ప్రపంచానికే ఆదర్శం



సర్వమానవ సంక్షేమమే లక్ష్యంగా సాగిపోతున్న కేరళ జనాభా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం ముదావహం. దేశమంటే మట్టికాదోరు.. దేశమంటే మనుషులోరు%ా% అన్న మహాకవి గురజాడ మాటలను ఆచరణలో పెట్టేందుకు మార్క్సిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలు.. అచ్యుతానందన్, పినరయి విజయన్ వరకూ%ా% లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వాలు సాగించిన కృషి%ా% నేడు కేరళ మోడల్‌గా ప్రశంసలందుకుంటోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో.. అందునా యువత అత్యధికంగా ఉండటం దేశ అభివృద్ధికి తోడ్పడేదే! ఈ అవకాశాన్ని మానవ సంక్షేమానికి, దేశ సౌభాగ్యానికి ఎలా వినియోగించవచ్చో కేరళ నిరూపిస్తోంది. అత్యధిక జనాభా కంటే విద్య, వైద్య నైపుణ్యాలున్న యువతే ఆస్తి అని చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతి తక్కువ శిశు మరణాలు నమోదులో%ా% అత్యంత అభివృద్ధి చెందిన అమెరికాను అధిగమించడం కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం మనదేశంలో ప్రతి వెయ్యి శిశు జననాలకు శిశు మరణాల రేటు (ఐఎంఆర్) 25గా ఉంది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలున్న అమెరికాలో 5.6 శాతం శిశు మరణాలు నమోదవుతుంటే, కేరళలో ఐదు శాతమే నమోదవుతున్నాయి. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మోర్టాలిటీ) దేశ సగటు 18 శాతం కాగా, కేరళలో 4 శాతం కంటే తక్కువ. రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ, నిధుల విడుదలకు మోకాలడ్డుతున్న మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేస్తూనే.. ఈ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని కార్పొరేట్, ప్రైవేటు వైద్యరంగం అందించే సేవలను అధిగమించడం హర్షనీయం. దేశంలోనే అత్యధికంగా 37 శాతం శిశు మరణాలు బిజెపి పాలిత మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నమోదయ్యాయి. మోడీ ప్రభుత్వం అత్యధిక నిధులు కట్టబెడుతున్నా%ా% బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్యం అథమంగానే ఉంటోంది. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారమే 2019– 20 నుంచి అన్ని ఆరోగ్య సూచీలలో కేరళ దేశంలో అగ్రస్థానంలో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంది. కేరళ సగటు ఆయుర్దాయం 77 కాగా, ప్రపంచ సగటు 73.5. కేరళలో ప్రసవ సమయాలలో మరణాల రేటు లక్షకు 46 మాత్రమే. జాతీయ సగటు 97. 2018లో నిఫా వ్యాప్తిని 10 రోజుల్లోనే రాష్ట్రప్రభుత్వం నియంత్రించగలిగింది. కరోనాను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం మొదలు, బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ చేతులెత్తేయగా, కేరళ ప్రభుత్వం, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శైలజ టీచర్ చేసిన అవిరళ కృషిని ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా అభినందించింది. 2021, 2022లో సంతానోత్పత్తి రేటు (టిఎఫ్ఆర్) దేశంలో 2 శాతంగా ఉండగా, 2023లో 1.9 శాతానికి తగ్గింది. జననాలు, మరణాలు ఒకదానికి ఒకటి సమతుల్యం చేసుకుంటే జనాభా స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రస్తుతం యువ జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో మనదేశం ముందుంది. ఆరోగ్యకరమైన, చదువుకున్న, నైపుణ్యం కలిగిన జనాభా నుంచే డెమోగ్రాఫిక్ డివిడెండ్ (జనాభా లాభం) లభిస్తుందని, యువజనాభా ఉత్పాదక శక్తిగా ఆవిర్భవిస్తుందని కేరళ మోడల్ నిరూపించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు%ా% భూపంపిణీ, అధునాతన విద్య, వైద్యరంగం, మానవాభివృద్ధి కోసం పడిన తపన నేడు సత్ఫలితాలనిస్తోంది. మహిళలు, పిల్లలపై కేంద్రీకరణ%ా% ప్రజల సామర్థ్యాన్ని విపరీతంగా పెంచింది. ఇటీవల డిజిటల్ లిటరసీని సైతం సాధించి దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచింది. ప్రజల కోసం అధికారాన్ని వెచ్చిస్తే, స్థానిక సంస్థలకు అధికారాలిస్తే సాకారమయ్యే అద్భుతాలను ఆవిష్కృతం చేసి, దేశానికే రోల్ మోడల్‌గా ఆవిర్భవించింది. విద్య, వైద్యరంగంలో అద్భుతాలతో 16 శాతంగా పెరిగిన వృద్ధ జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కమిషన్, కేరళ రాష్ట్ర వృద్ధుల విధానం దేశానికి దిశానిర్దేశం చేసేవే.
కేరళలాంటి రాష్ట్రాలకు అవసరమైన నిధులివ్వాల్సిన కేంద్రం%ా% గవర్నర్లు, జిఎస్‌టి నిధులను తొక్కిపెట్టడం తదితర రూపాల్లో అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడటం క్షమార్హం కాదు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, మతాల మధ్య, కులాల మధ్య కుంపట్లు పెట్టడం, మణిపూర్ మాదిరిగా మంటలు రేపడం దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆటంకం. కేరళ మోడల్‌ను అనుసరించే విధానాలను రూపొందించడం, తగిన వనరులను వినియోగించడం దేశ సర్వతోముఖాభివృద్ధికి అత్యవసరం.

# యూరియా కోసం రైతుకు తప్పని నిరీక్షణ..

రాజంపేట: యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఉదయం 5 గంటల నుండి సొసైటీల ముందు రైతులు.. క్యూలైన్లో చెప్పులను పెట్టి ఏడు ఎనిమిది గంటలు లైన్లో నిరీక్షణ చేసినా రైతుకు ఫలితం దక్కడం లేదు. వచ్చే కొద్దిపాటి యూరియా కోసం వారు బారులు తీరడంతో అధికారులు పోలీసుల సహాయంతో రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతుంది. వచ్చిన యూరియా అందరికీ సరిపోక రైతులు వెను తిరగాల్సి వస్తుంది. అదే పరిస్థితి ప్రస్తుతం రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ఎదురైంది. వచ్చిన లారీని అడ్డుకొని రైతులు తమకు సరిపడ్డ యూరియా అందటం లేదని నిరసన వ్యక్తం చేశారు. సుమారు 1000 మంది రైతులు క్యూ లైన్‌లో వేచి ఉంటే కేవలం రెండు వందల బస్తాల యూరియా రావడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పంటలకు సరైన సమయంలో యూరియా అందక పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఏడు ఎనిమిది గంటలు లైన్లో వేచి చూస్తే అప్పుడు యూరియా దొరుకుతుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు.



# సినిమా..




## శరవేగంగా పెద్ది షూటింగ్

గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు-, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.


## నవంబర్ 7న జటాధర విడుదల



సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్‌బాబు. ఈటాలెంటె-డ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈమూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు- ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టు-కున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టు-కున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.

## పెళ్లి ఎప్పుడో చెప్పిన జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పంచిందింది. శిఖర్‌పహారియాతో పెళ్లి వార్తలు తెగహల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు ' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే, శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమెఫోన్ స్పీడ్ దయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీఓక్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తోతెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## ఓవర్ నైట్ స్టార్ గా తేజ...

తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు. ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు. హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది. గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్‌లో కూడా రెండవ రోజున ఈచిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం. ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈచిత్రానికి 27కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. 30కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగాగ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు.




## ఉత్తుత్తి మాటలే..




న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశానికి, దేశ ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకే ఈ సంస్కరణలంటూ ఊదరగొడుతూ వస్తున్న మోదీ సర్కారు.. గడిచిన 11 ఏండ్లలో తీసుకున్న ఏ నిర్ణయంతోనూ ఎవరికీ పెద్దగా ఒనగూరిన లాభమేమీ లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా పన్నుల విషయానికొస్తే.. కార్పొరేషన్, వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ)ల్లో కోతలు పెట్టినా.. సంపద పన్ను రద్దు చేసినా ఫలితం శూన్యమేనన్న అభిప్రాయాలు న్నా యి. ఎల్‌టీసీజీ, కొత్త ఐటీ చట్టానిదీ ఇంతే. అన్నింటా తన వారికి, తన రాష్ట్రానికి పెద్దపీట వేయడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే చెల్లిందని చెప్పవచ్చు. గతంలో జరిగిన తన సౌదీ అరేబియా పర్యటనలో స్వరాష్ట్రం గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఆ దేశ సావరిన్ ఫండ్ పీఐఎఫ్ కార్యాలయం పెట్టేందుకు వీలుగా చట్టాన్నైతే సవరించేశారు మరి. డివిడెండ్, వడ్డీ, దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నుల నుంచి పీఐఎఫ్‌కు మినహాయిం పు కల్పించడం విశేషం.

కేంద్రంలో మోదీ సర్కారు అధికారం లోకి వచ్చిన 2014-15 నుంచి 2024-25 వరకు ఈ పదేండ్లలో దేశ జీడీపీ కంటే డిమాండ్‌లో వాస్తవిక వృద్ధిరేటు సగటు తక్కువగానే ఉంటున్నది. జీడీపీ 6.2 శాతంగా ఉంటే.. వినియోగం వృద్ధి 6.1 శాతంగానే ఉన్నది. తయారీ రంగానిదీ ఇంతే. ఇక పొదుపు విషయానికొస్తే..

## గుడ్ న్యూస్ చెప్పిన ఇన్ఫోసిస్..




క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో ఉద్యోగులకు ఇన్ఫోసిస్ గుడ్ న్యూస్ చెప్పింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి పనితీరు ఆధారిత బోనస్లను ప్రకటించింది. ఆగస్టు నెల వేతనంతో పాటు అర్హులైన ఉద్యోగులకు సగటున 80 శాతం బోనస్ చెల్లించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఇన్ఫోసిస్ ఈ స్థాయిలో బోనస్‌ను ప్రకటించడం టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇన్ఫోసిస్ తమ కంపెనీ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా ఈ చెల్లింపులు జరగనునున్నట్లు పేర్కొంది. లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89 శాతం బోనస్ చెల్లించనున్నారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80 శాతం చొప్పున చెల్లింపులు జరగనున్నాయి. లెవల్ పీఎల్, లెవల్ పీఎల్ 6 ఉద్యోగులకు 78-87 శాతం, 75-85 శాతం, పీఎల్4, పీఎల్, పీఎల్ కేటగిరీల్లోని ఉద్యోగులకు 80 శాతం, 75 శాతం, 70 శాతం చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు పేర్కొంది. జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో ఇన్ఫోసిస్ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7 శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5 శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. ఆగస్టు 20 నాటికి ఇన్ఫోసిస్ రూ. 6.20 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థలలో ఒకటిగా నిలిచింది. స్టాక్ మార్కెట్‌లోకంపెనీ షేరు ధర రూ.1,495.10గా ముగిసింది.

## జియో యూజర్లకు బిగ్ షాక్..

ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ ప్లాన్‌లో పలు మార్పులు చేసింది. రూ.249 ధరలో 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటా అందించే ప్లాన్‌ను తాజాగా బంద్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై 1.5 జీబీ/డే ప్లాన్‌లే బేస్ ఆప్షన్‌గా అందుబాటులో ఉండనున్నాయి. దీంతో జియో యూజర్లు ఎక్కువ డేటా ఉన్న ఆప్షన్ల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, ఇప్పటికే జియోలో
ఈ ప్లాన్ అమల్లోకి వచ్చింది. జియో వెబ్‌సైట్‌లో 1జీబీ ఎంట్రీ లెవల్ ప్లాన్ కనిపించడం లేదు.

దీంతో ప్రస్తుతం 28 రోజులకు రూ.299తో 1.5 జీబీ/డే, రూ.349తో 2 జీబీ/డే ప్లాన్లు మాత్రమే అందుబాటులో కొనసాగుతున్నాయి. ఇక, జియో తాజా నిర్ణయంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నిర్ణయం ఎంతో మందికి అధిక భారం కావొచ్చని, ఇష్టానుసారంగా ప్లాన్స్ ఛేంజ్ చేసుకుంటే పోతుంటే.. ట్రాయ్ నిద్రపోతుందా అని సోషల్ మీడియాలో వినియోగదారులు కామెంట్స్ పెడుతున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215